# యజ్ఞము

పండిత సి. హెచ్. ఫ్రాన్సిస్

# యజ్ఞము

రచయిత

**పండిత సి. హెచ్. ఫ్రాన్సిస్**

(సాహిత్య సుధాకర)

వేటపాలెము (పోస్టు) - 523 187

ప్రకాశం జిల్లా (ఆంధ్ర ప్రదేశ్)

**క్రిస్టియన్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్**

9-1-38/1, వై.యం.సి. ఎ., సికింద్రాబాద్ - 500 003.

ఫోన్ : 040 -66330113

# SACRIFICE


by

**Pandit. Ch. Francis**

(Sahitya Sudhakara)



March 2008

5000 copies

**Rs. 12-00**

Distributed by

**Christian Book Distributors**

9-1-38/1, Y.M.C.A., Secunderabad - 500 003

Phone : 040 - 66330113

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ఉపోద్ఘాతం | ... ... ... | 4-5 |
| 2. | పాపము – నిర్వచనం | ... ... ... | 6-7 |
| 3. | ప్రాయశ్చిత్తం | ... ... ... | 7-8 |
| 4. | వివిధ యజ్ఞములు | ... ... ... | 9-11 |
| 5. | మహా యజ్ఞము | ... ... ... | 12 |
| 6. | అవతారం | ... ... ... | 13 |
| 7. | యజ్ఞ పశువు క్రీస్తు | ... ... ... | 14,15,16 |
| 8. | గురు యజ్ఞం | ... ... ... | 17 |
| 9. | ద్విజత్వ సిద్ధి | ... ... ... | 18 |
| 10. | లేఖనములలోని ఉదాహరణలు | ... ... ... | 19,20,21 |
| 11. | పాపము, యజ్ఞము | ... ... ... | 22 |
| 12. | ప్రవచనములు నెరవేర్పు | ... ... ... | 23,24 |

# ఉపోద్ఘాతము

ఆర్యుల మతానుసారము మానవోన్నతికి మూడు మార్గ దర్శకములు గలవు. అందొకటి ధర్మసూత్రములు, రెండవది గృహ్య సూత్రములు, మూడవది శ్రౌత సూత్రములు మనుష్యునకు కావలసిన ధర్మములను తెలియజేయునవి ధర్మసూత్రములనియు, తదానుసారము ననుసరింపదగిన సంస్కార విధులను తెలియజేయునని గృహ్యసూత్రములనియు, యజ్ఞయాగాదులను తెలియజేయు శ్రౌత సూత్రములు – పై రెంటి ననుసరించి వేదానుకూలముగా జేయదగినవనియు తెలియునది. శ్రౌత సూత్రములలో నొక్కొక్కటి ఒక్కొక్క వేదమునకు ముఖ్యము. యజుర్వేదమునకు కాత్యాయన శ్రౌతసూత్రము ముఖ్యము. ఇయ్యది వేదాంగములలో నొకటి కల్పసూత్ర, వేద, శాస్త్రానుసారమే ఆర్యులు యశ్వమేధ, నరమేధ, అజామేధాది యజ్ఞములను చేయుచుండిరి.

చత్వారింశతి సంస్కారములు జీవాత్మ పరిశుద్ధతకై ఏర్పడినవి. ఆ నలుబదింటిలో పాకయజ్ఞములు ఏడు, హవిర్యజ్ఞములు ఏడు, సోమ యజ్ఞములు ఏడు, పంచ మహా యజ్ఞములు పోను మిగిలినవి గర్భాదానము, పుంసదనము, సీమంతము, జాతకర్మ, నామకరణము, నిష్క్రమణము, అన్నప్రాసన, చౌలము, ఉపనయనము, ప్రాణాపత్యము, వివాహము, స్నాతకము, వానప్రస్థము, సన్మానము. వీనిలో కొన్ని ప్రతిదినము చేయవలసినవి. కొన్ని ఆయా కాలములలో చేయవలసినవి. పంచయజ్ఞములతో పాటు ఔపాసన, అగ్ని హోత్రము అనుదినము చేయవలసినవి. ధర్మపూర్ణమాసమును హవిర్యజ్ఞ పదునైదు రోజులకొకమారు చేయునది, ఔపాసన పాకయజ్ఞములో చేరినది. తదితర పాకయజ్ఞములు సంవత్సరములనకొకమారు చేయునవి. సోమ యజ్ఞములు ఏడును; ఇతర సంస్కారములును జన్మలో నొక పర్యాయము చేసిన చాలునందురు.

పరిపాలన పరమేశ్వరుని చిత్తానుసారము మారుచుండునని మనువు చెప్పెను. ప్రమాణములు రెండు. ఒకటి వధాయకతా ప్రామాణ్యము, రెండు అనుష్టానుకత ప్రామాణ్యము మొదటిది సదా నిలిచియుండును. రెండవది దేశకాల పరిస్థితులను బట్టి మారుచుండును. కావున నేడు భారతీయులలో అనేకులు ఆయా యజ్ఞయాగములందు జంతు బలిచ్చుటకు ఒప్పుకొనరు. అవి యొకప్పుడాచరింపబడినవే. ప్రస్తుతము పంచ మహాయజ్ఞములు మాత్రమే ఆచరింపదగినవందురు.

సత్యవేదమగు బైబిలునందు పాత, క్రొత్త నిబంధనలను రెండు నిబంధనలు గలవు. పాత నిబంధనలో ఆవులను, మేకలను, గొఱ్ఱెలను, పొట్టేళ్ళను సమాధానార్థ బలిగను, దహనబలిగను, ప్రాయశ్చిత్తార్థబలిగను యూదులు అర్పించుటను గూర్చి వ్రాయబడినది.

అన్యులు అర్పించు ఆయా బలులు ప్రజాపతి యజ్ఞమునకు సాదృశ్యము లయినటులనే, యూదులర్పించు నానా బలులు యేసుక్రీస్తు చేసిన మహా యజ్ఞము (సిలువ)నకు ఛాయామాత్రములై యున్నవి. ప్రజాపతి ఆత్మలను రక్షించుటకై తననుతానే యజ్ఞపశువుగా అర్పించుకొనెనని అర్వేయములు సాక్ష్యమిచ్చుచుండ, అందరిని రక్షించుటకొరకే లోకపాపములను మోసికొనిపోవు యేసుక్రీస్తు అను దేవుని గొఱ్ఱెపిల్ల బలియాయెనని బైబిలు దృఢపరచుచున్నది. వాస్తవమునకు పురుషమేధ రహస్యమే క్రీస్తు ప్రభువుని సిలువ మరణ పునరుత్థాన రహస్యమని సమన్వయదృష్టితో జూచువారు గ్రహించగలరు.

లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను. సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను. అటుపిమ్మట ఐదు వందలకంటె ఎక్కువైన సహోదరులకు ఒక్క సమయమందే కనబడెను (1 కొరింథీ 15:3–6). ధర్మశాస్త్రమునకు క్రీస్తు సమాప్తియై యున్నాడు (రోమా 10:4). ప్రాచీనులర్పించు ఆయా యజ్ఞ యాగములు ఛాయయే గాని నిజస్వరూపము క్రీస్తులోనే యున్నది. (కొలొస్స 2:17, హెబ్రీ 10:1). కాబట్టి ఆర్యులేమి, యూదులేమి, క్రైస్తవులేమి ఆయా పశుపక్షులను ప్రస్తుతము యజ్ఞయాగములలో జంపవలసిన అవసరము లేదు.

కాగా నేడు సర్వులాచరింపవలసిన దశయాగములు మాత్రమే నిలిచి యున్నవి. అవి బైబిలునందును, మనుస్మృతియందును

వ్రాయబడినవి. అవేవనగా – 1. విశ్వాసయాగము; (ఫిలిప్పీ 2:17). 2. స్తుతి యాగము; (హెబ్రీ 13:15). 3. ఈవుల యాగము (ఫిలిప్పీ 4:18). 4. ఉపకార ధర్మయాగము; (హెబ్రీ 13:16). 5. సజీవయాగము అనగా సమర్పణ; (రోమా 12:2). 6. బ్రహ్మ యజ్ఞము. 7. దేవ యజ్ఞము; 8. పితృ యజ్ఞము; 9. మనుష్య యజ్ఞము; 10. భూత యజ్ఞము.

ప్రజాపతియగు క్రీస్తు మానవపాప ప్రాయశ్చిత్తార్థమై చేసిన మహా యజ్ఞమునందు సమస్త యజ్ఞయాగముల యుద్దేశ్యము నెరవేర్చబడినది. మానవులాయజ్ఞమందు విశ్వాసముంచుటద్వారా పాపక్షమాపణ కలిగి ద్విజులై పరిశుద్ధాత్మనుబొంది పరలోక రాజ్యమునకు చేరుట సత్యవేద సమ్మతము. ద్విజులగువారు అనగా దేవుని బిడ్డలు (యోహాను 3:5). అనుదినమును ఉపరోక్తాదశ యాగములాచరించుచు ఇహపర సుఖములను బొంది లోక కళ్యాణము కొరకు పాటుబడెదరు గాక. తథాస్తు.

"లేఖనములయందు మీకు నిత్యజీవముగలదని వాటిని పరిశోధించుచున్నారు. అనే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నది" అని క్రీస్తు చెప్పెను (యోహాను 5:39).

**- రచయిత**

# యజ్ఞము

శ్రు॥ యథాచారీ తథాభవతి సాధుకారీ సాధుర్భవతి పాపకారీ
పాపోభవతి పుణ్యః పుణ్యేన కర్మణాభవతి పాపః పాపేనా॥

అని బృహదారణ్యకోపనిషత్ 6వ అధ్యాయము 5వ మంత్రమందు గలదు. అనగా, ఎట్లు ఆచరించువాడో అట్టివాడగును. మంచి పనులు చేయువాడు మంచివాడగును. పాపము చేయువాడు పాపియగును. పుణ్యము కలుగు పనులు చేయుటచేత పుణ్యమును, పాపము గలుగు పనులు చేయుటచేత పాపమును కలుగుచున్నది.

పాపమనగానేమి? "ఆజ్ఞాతిక్రమమే పాపము" (యోహాను 3:4); "సకల దుర్నీతియు పాపము" (5:17). పాపము చేయువారు లేరా? ఏ భేదమును లేదు, అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారని సత్యవేదము సాక్ష్యమిచ్చుచున్నది. దేవీభాగవతము, షష్టమ స్కంధము 10వ అధ్యాయంలో –

శ్లో॥ పాపం కరోతి మనుజస్తథా దేవాద యోపిచ
తథా నాయరణో రాజన్న రశ్చ ధర్మజావుభౌ !
జాతౌ కృష్ణార్జునే కౌమంశౌ నారాయణస్య సౌ
పురాణ పీఠికేయం వై మునిభిః పరికీర్తి తౌ॥

తా॥ ఓ రాజా ! మనుష్యుడు పాపము చేయుచున్నాడు. అట్లే దేవతలును పాపము చేయుచున్నారు. ధర్మని పుత్రులగు నారాయణును, నరుడు అను ఋషులును అటులనే పాపము చేసినందున వారు నారాయణుని అంశవలన కృష్ణార్జునులయి పుట్టిరి. ఇది మనుషులచే జెప్పబడిన పురాణ పీఠికయందున్నది అని వ్యాసమహర్షి చెప్పెను. మరియు స్కాందపురాణము శ్రీరంగ మహాత్మ్యము 7వ అధ్యాయములో –

శ్లో॥ కామక్రోధవశాస్సర్వే దేవ ఋషిక్ పితృమానమానవా ॥

అనగా సమస్త దేవతలును, పితృ దేవతలును మానవులును కామక్రోధములకు వశులైనవారేయని వ్రాయబడి యున్నది. హేమాద్రి ప్రాయశ్చిత్త కాండములో మహా సంకల్పమునందు వ్రాయబడిన ప్రకారము –

శ్లో॥ జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్తాను; జ్ఞానతోజ్ఞాతశ్చ
కామతో కామతః, స్వతః పరప్రేరణయావా
సమ్భావితానాం సర్వేషాం పాపానామిమ
పనోదనార్థం ఇష్టదేవతా ప్రీత్యర్థమ్॥

"సమస్త మానవులు జాగ్రతావస్థ, స్వప్నావస్థ, సుషుప్త్యావస్థల యందును – జ్ఞానమువలనగాని, అజ్ఞానమువలన గాని, కోరికచేతగాని, కోరికలేకుండగాని నానావిధములైన పాపములు చేసి వాటిని బాపుకొనుటకై ఇష్ట దేవతలను ప్రార్థించుచున్నారని తెలియుచున్నది" కావుననే భారతీయుడు ఇట్లు ప్రార్థించుచున్నాడు.

శ్లో॥ పాపోహం పాపకర్మాహం పాపాత్మ పాపసంభవః
త్రాహిమాం కృపయాదేవా శరణాగతి వత్సలా ॥
అన్యథా శరణం నాస్తిత్వమేవ శరణం మమ....

అనగా నేను పాపిని పాపము చేయుచున్నాను. పాపాత్ముడను పాపమందు పుట్టితిని; ఓ కృపగల దేవా ! నీ శరణుజొచ్చిన నన్ను రక్షింపుము. నాకు వేరే శరణం లేదు; నీవే నాకు శరణాగతి. అదియును గాక, మనుస్మృతి ద్వితీయాధ్యాయములో–

శ్లో॥ ఇంద్రియాణాంచ సర్వేషాంయద్యే కంక్షరతీంద్రియమ్
తేనాస్యక్షరతి ప్రజ్ఞాద్రుతేః పాదాది ఓదకమ్॥

అనగా తోలుసంచిలోని నీరంతయు ఒక కాలుకట్టు విప్పినంతనే కారిపోయినరీతి, యింద్రియములలో నొక యింద్రియము విషయాసక్తమైన యెడల నన్ని ఇంద్రియముల సంబంధమైన బుద్ధి వ్యవస్థ లేక పాడైపోవును.

అయితే పాపమువలన శిక్షయేది?

"పాపదవశ్యం నరకంప్రయాతి" అను నీతిశాస్త్ర వాక్యానుసారము నరకమే గతి. భగవద్గీతలో–

శ్లో॥ నానాచిత్త విభ్రాంతా మోహజాల సమావృత్తాః
ప్రశాక్తా కామభోగేషు పతన్తినరకే అశుచౌ !

నానావిధములైన చిత్త విభ్రాంతులచే మోహమనెడి జాలము (వల) చేత చుట్టబడినవారై, కామ భోగములచేత కూడుకొనిన వారై ఆత్మశుద్ధి లేక నరులు నరకమందు పడుచున్నారని గలదు.

అటులైన నరకము నుండి తప్పించుకొను మార్గము, లేక ఉపాయమేది? "అలౌకికోపాయ బోధకత్వం" వేదత్వం అనగా లోక సామాన్యమునకు తెలియని ఉపాయమును తెలియజేయుట వేద లక్షణము వేదము ప్రభు సంహిత, అదియొక కార్యమును చేయుమని శాసించునేగాని ఎందుకు చేయవలెను? అని ప్రశ్నించిన ప్రత్యుత్తరమివ్వదు. అయినను మనము వేదోక్తులను పాటించియే తీరవలెను. "నాన్యః పంథా విద్యతే ఆయనాయ" వేరొక మార్గము లేదు; ఇదియే మార్గము.

పాపక్షమాపణ పొందినయెడల నరకముండదు. అయితే పాప పరిహారమెట్లు గలుగును? కూర్మ పురాణములో –

శ్లో॥ అకృత్వా విహితం కర్మకృత్వా నిన్దితా మేవవా॥
దోషమాప్నోతి పురుషః ప్రాయశ్చిత్తమ్ వినిశోధనమ్॥

అనగా పురుషుడు అనుకూలించిన కర్మను చేయకను, దూషించదగిన దానిని జేసియును పాపము బొందుచున్నాడు. ప్రాయశ్చిత్తము శుద్ధిని గలుగచేయునది. ప్రాయశ్చిత్తమన చిత్తశుద్ధి చేసిన తప్పునకు శిక్ష లేనిదే చిత్తశుద్ధి ఎట్లు కలుగును? కావున యజమానుడు తానే బలిగా నిడుగొనుట ప్రథమ ధర్మము, లేదా అతనికి బదులుగ పశు, నరులలో నొకరిని బలిగా నిచ్చిన యెడల అతనికి మోక్షమునిచ్చుననియు, సర్వ పాపములను హరించి సర్వ సుఖములనిచ్చి విముక్తి నొసంగునను యాగమ విధులన్నియు ఆర్యులు నమ్మిరి. సామవేద తాండీయ మహా బ్రాహ్మణములో –

శ్లో॥ సర్వపాప పరిహారో రక్తప్రోక్షణ మవశ్యకమ్
తద్రక్తం పరమాత్మేస పుణ్యాదాన బలియాగమ్॥

అనగా సర్వపాప పరిహారార్థము రక్తప్రోక్షణమవసరమై యున్నది. ఆ రక్తము పరమాత్ముని కొరకు పుణ్యమైన దానమును బలియును యాగమై యున్నది. మరియు "అపరం వ్యవస్థానుసారేణ రుధిరపాతం వినా పాప విమోచనం నభవిచితి" అనగా ధర్మశాస్త్ర ప్రకారము రక్తము చిందింపకుండ పాపవిమోచన కలుగదని సత్య వేదోక్తి. ఆర్యుల ధర్మశాస్త్రమగు "మనుస్మృతి" పంచమాధ్యాయములో స్వయంభువు పశువులను యజ్ఞార్థము సృజించి నాడు కావున యజ్ఞములలో వానిని చంపుట దోషము కాదు. అవి యాగముల కొరకు చావునొంది తిరుగ జాత్యుత్కర్షము నొందుచుండును. ఇట్టి పట్టుదలతో వేదతత్వార్థవేత్తయగు బ్రాహ్మణుడు (యజ్ఞము చేయునపుడు) పశువులను జంపుచు నా పశువులను తన్ను యుత్తమగతిని బొందించునని గలదు. అయితే జంతుబలులిచ్చుట హింసకాదా? యని ప్రశ్నించినయెడల "సహింస్యాత్సర్వా భూతాని" యని వేదమే చెప్పుచున్నది. కనుక యజ్ఞ యాగములలో చేయబడు హింస, హింసగా పరిగణించబడదని ప్రాచీన సిద్ధాంతము. "అధర్వ"మని యాగమునకు నొక పదము తరచుగా వేదమునందు ప్రయోగింపబడెను. దాని యర్థము భాష్యకర్తలు అధర్వమన హింసలేనిదని వ్రాసిరి. ఒకప్పుడు విషమమృతమయినట్లు హింసయు ఉపకారము కావచ్చును. పశు హింసవలన లోకమునకు ఏమి క్షేమము గలదో! లోక సామాన్యమునకు తెలియని యుపాయములను తెలియజేయుటేగదా వేద లక్షణము ! పూర్వము మాంసాహారమే దేవతాప్రీతి యని విధించి ఆర్యులు వ్రాసిరి. అంచేత – చంపవలెను, అని సర్వత్రా భాష్యములలో నర్థము కలదు. పురుషసూక్తములో "దేవాయజ్ఞ మతన్వత" అనగా దేవతలు యజ్ఞము చేసిరని కలదు ( ఆంధ్ర వేదములను రచించిన శ్రీ బంకుపల్లె మల్లయ్యశాస్త్రిగారు).

యజ్ఞకర్మకు (Sacrifice) అగమవిధియని మరియొక నామము. ఈ యజ్ఞకర్మ మార్యులకు ప్రాముఖ్యమైనది. ఆర్యుల మతము, జీవనము సర్వము దీనిపై నాధారపడినవి.

స్తుతులు, బల్యర్పణ మీరెండు మార్గములే దైవములకు దృప్తికరములగునవి యని వారు తలంచిరి. కాబట్టి వేదశాస్త్రములను పరిశీలించి జూచిన యజ్ఞమే మోక్షదాయకముగా వివరించబడినది. భగవద్గీతలో –

శ్లో॥ యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యన్తే సర్వకిల్బిషైః
(3వ అధ్యా॥ 13 శ్లో)

అని కలదు. అనగా సమస్త పాపములనుండి విముక్తుడగుటకు యజ్ఞమే తరుణోపాయము. యజ్ఞమనగా –

"యజతే యజ్ఞః యజదేవపూజా సంగతి కరణదావేషు" ఈ ధాతువు నుండి యజ్ఞ శబ్దము సిద్ధమగుచున్నది. అగ్నిహోత్రము మొదలుకొని అశ్వమేధ పర్యంతము జగదుపకారమునకై చేయబడునది యజ్ఞము. యజ్ఞమే యాగము. "యజుర్యజనాత్త"ని విద్యారణ్యులు చెప్పిరి. అనగా యాగము నెరవేర్చునది. యజుర్వేదమని తాత్పర్యము యాగ శబ్దమునకు కర్మయే యర్థము.

ఆర్యులు ప్రాయశ్చిత్తార్థమైన నరమేధ, గోమేధ, అజామేధ, అశ్వమేధాది యజ్ఞములు చేయుచుండిరని అర్వేయములు సాక్ష్యమిచ్చుచున్నవి. అటులైన యజ్ఞముల నెవరు నియమించిరి? ఋగ్వేదము ప్రథమ మండలము 164వ సూక్తమునందు వ్రాయబడినదానిని బట్టి –

సృష్టికర్త యాగమనిధుల నేర్పరచెను. యాగమాచరణ సహాయమున ప్రపంచముద్భవించెను. ఆ శక్తి సహాయమున ప్రపంచము నిలిచినది. ప్రపంచముయొక్క గర్భమే 'యాగమనిధి' యని తెలియుచున్నది. భగవద్గీత 3వ అధ్యాయములో –

శ్లో॥ సహయజ్ఞాః ప్రజాసృష్ట్వాపురోవాచ ప్రజాపతిః
అనేన ప్రసవిష్యధ్వమేష నోస్త్విష్ట కామదుక్॥
సర్వే ప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపిత కల్మషాః॥
యజ్ఞశిష్టామృత భుజోయన్తి బ్రహ్మస్సనాతనమ్॥
నాయంలోకోస్త్య యజ్ఞస్యకుతోన్యః కురుసత్తమా?

అనగా, యజ్ఞములు ఆదియందే ప్రజలతో కూడ ప్రజాపతివలన సృజింపబడిన సమస్తమైన కోరికలను యిచ్చుచున్నవి. యజ్ఞమువలన పాపక్షమను బొంది శాశ్వత బ్రహ్మము బొందవచ్చును. ఓ కురు శ్రేష్ఠుడా ! అవి లేనివారికి ఇహలోకము లేదు. ఇక పరలోకమెట్లుండును? అని వ్రాయబడెను.

"ప్రార్థనావిధి యొక్కటే చాలును, యజ్ఞ కర్మమేల" యని ప్రశ్నించిన యెడల దానికి సమాధానము వేదములోనే గలదు.

"బ్రహ్మయజనము నొక్కటిగనుండును. యజనమని పలికినపుడంతయు బ్రహ్మమధ్యాహారముగ నున్నదని తెలియవలెను. అబ్రహ్మయజనము దైవ ప్రీతికరముగనుండదు అని ఋగ్వేదము 7వ మండలము 26వ సూక్తము ఒకటవ ఋక్కు తెలియజేయు చున్నది.

కావున యజ్ఞము లేకుండ ప్రార్థన చేసి పాపక్షమాపణ, లేక పరిహారమొందుట అసాధ్యము. ఇక యజ్ఞయాగములను గురించి వేద శాస్త్రములేమని సాక్ష్యమిచ్చుచున్నవి?

శ్రు॥ ఇయంవేదిః పరోఅన్తః వృదివ్యా అయం యజ్ఞోభువనస్యనాభిః (ఋగ్వేదము 1 మం. 164సూ, 35సం॥) అనగా యీ వేది భూమికి చిట్టచివర ఈ యజ్ఞము సర్వభూత జాతమునకు ఆధారము మరియు "ప్రధమాని ధర్మాణి" ధ్రమ ధర్మములు. "యజ్ఞేసర్వం ప్రతిష్ఠితం" యజ్ఞమే సర్వమును ప్రతిష్ఠించును. "యజ్ఞేనవా దేవా దివంగతాః" యజ్ఞమువలననే దేవతలు స్వర్గము జెందిరి. "యజ్ఞోవైసుతర్మానౌః" ( ఋగ్వేద బ్రాహ్మణము 1,3,13). అనగా యజ్ఞమే సుకరముగా తరింపజేసెడి నావయనియు "ఋతస్యనః పధానయాతి విశ్వానిదురితాః" (ఋగ్వేదము 10 మం. 31 సూ. 6 మం॥) యనగా యజ్ఞమును మార్గము ద్వారా లోకపాపముల నుండి తొలగించి దోడ్కొని పొమ్మనియు వేదములు ఘోషించుచు యజ్ఞము పాపనివారణ కొరకు తప్పక చేయవలసిన ముఖ్య కర్మయని బోధించుచున్నవి.

కావుననే క్షీర మృతాది అర్పణలకు బదులుగా వానిని గలిగించు గోవులు, మేకలు, గొఱ్ఱెలు బలులుగా నిలిచెను. వానిని గాపాడు మనుజుని సైతము పూర్వులు బలిగ నివ్వసాగిరి. యజమానుడు తనకు మారుగా పశు నరులలో నొకరిని బలిగ యిచ్చుచుండును. పురుషసూక్తమునుబట్టి నరమేధమును, విరాజయ జనమునుబట్టి యశ్వమేధమును, పూషణునకు మేకపై

బ్రీతియని అజా (మేక) మేధములను ఆర్యులొనరింపసాగిరి. వారు యాగమ విధులను నేర్పుటకై శాస్త్రమేర్పరిచిరి. త్యాగధనులగు నార్యులు దైవభక్తిచేత నరమేధమొనర్చుట యచ్చరువు గాదని శ్రీ భట్టాచార్యులభిప్రాయపడిరి. డాక్టరు రాజేంద్రలాల్ విత్తుగారు పురుషమేధము వేదయాగమునకు పూర్వమే కలదని తెల్పిరి.

## 1. పురుషమేధము

శు॥ సప్తాస్యాసన్పః ధయంః త్రిస్సప్త మిథః కృతా॥
దేవాద్వయజ్ఞం తన్వానాః అబధ్నన్పురుషమృతుమ్॥
(ఋగ్వేదము 10 మం. 13 అను 90 సూ. 7 మం.)

తాత్పర్యము : దేవతలు యజ్ఞమును చేయుచున్నవారయి జీవుని పశువుగా నియమించినంత ప్రాణపంచకము, అహంకార బుద్ధులనెడి ఏడును పరిధులయ్యెను. భూత పంచకము, తాన్మత్ర పంచకము, జ్ఞానేంద్రియ పంచకము, కర్మేంద్రియ పంచకము, మనస్సు అనెడి ఇరువది యొకటియు సమిధులుగా చేయబడినవి. (అనగా దేవతలచే చేయబడి యజ్ఞమునందు పంచభూతాలు సాధనములయి ప్రవర్తించినవి).

ఋ॥ తం యజ్ఞమ్మర్ హిషి ప్రౌక్షన్ పురుషజాత మగ్రత॥
తేనదేవా అజయస్త సాధ్య ఋషయశ్చయే॥
(ఋగ్వేదము 10,13,90,8)

తాత్పర్యము : ఆ యజ్ఞమునకు ఆరంభమందు పుట్టిన జీవుని యజ్ఞములో సంస్కరించిరి. అనగా లీనము చేసినంత జ్ఞానులును ఋషులును ఆ జీవుని పూజించిరి. అనగా తమ తమ దేహములలోనుండెడి జీవాత్మను సమర్పించి భగవంతుని పూజించిరి. మరియు యజ్ఞపశువుగ నొనర్పబడిన శునశ్శేపుని సూక్తములు ఋగ్వేదము ప్రథమ మండలము, 24వ సూక్తము నుండి 34వ సూక్తములు ఋగ్వేదము ప్రథమ మండలము, 24వ సూక్తము నుండి 34వ సూక్తమువరకు నున్నవి. ఐతరీయ బ్రాహ్మణములోను, కృష్ణ యజుర్వేద బ్రాహ్మణములోను శుక్లయజుర్వేదమునకు సంబంధించిన ఖిల్లాలోను, శతపథ బ్రాహ్మణాంత్య భాగములోను నరమేధయాగము సూచింపబడినది.

## 2. గోమేధము (A)

మం॥ త్రోణోమేక ఉదరకంగామ, వాజవి మాంసమేకః పింతతి॥
సూనయాభృతం, అనిమ్నచః శకృదేకో
అపాభరిత్కింస్విత్పుత్రేభ్యః పితరా ఉపాసతుః ॥
(ఋగ్వేదము మం. 1 అను 22 సూక్తం 161, ఋక్కు 10)

తాత్పర్యము : ఒకడు గోవునుండి వచ్చు రక్తమును గ్రుమ్మరించుచున్నాడు. మరియొకడు కోతులతో మాంసమును సంపాదించు చున్నాడు. నిశ్శేషముగా మాంసమును ఛేదించిన తరువాత దానిని కడుపులోనున్న పేడను ఒకడు పారవేయుచున్నాడు. ఇట్లు పుత్ర స్థానీయులగు ఋషులీవిధమున చేసిన తరువాత తల్లిదండ్రులు (అనగా, యజ్ఞమును చేయించుచున్న యజమాన దంపతులు) ఏమి పొందుదురు? (లేక) యజ్ఞమునందేమి కార్యమును చేయవలసియున్నది?

పై మంత్రము ప్రకారము " ఆర్యులు సంపూర్ణ మాంస భక్షకులుగా నుండిరి. ఇంతియేగాక గోమేధము పుణ్యకార్యముగా భావింపబడుచుండెను. నరమేధము కూడ నచ్చుట నవలంబింపబడుచుండెను. భవభూతి యుత్తర రామచరిత్రములో వాల్మీకి ఆతిథ్యమొసంగు సందర్భమున,, జాగరూకులై పరీక్షించినచో వసిష్ఠకెట్టి తటిపి పెయ్యను జంపి విందుజేసినది తెలియజగలదు" (ఆర్యకవి కుతంత్రము 20వ పుట).

## (B) "నరమేధము"

"సోమకుడు తన కుమారుని జంపి నరమేధము చేసెను"
(భారతము అరణ్యపర్వము 3వ అధ్యాయములో)

## 3. అశ్వమేధము

పురుషమేధమును పోలినదే అశ్వమేధము. ఋగ్వేదము ప్రథమ మండలము 162వ సూక్తములో 1 నుండి 22 వరకు గల ఋక్కులలో యశ్వమేధమును గూర్చి వివరించబడినది. యాగార్హమగు అశ్వము (గుఱ్ఱము)ను ఆర్యులిట్లు ప్రార్థించిరి –

ఋ॥ సుగవ్యనోవాజీ స్వశ్వ్యం పుంసః
పుత్రాఉత విశ్వాపుషంరయమ్
అసగాస్త్వంనో అదితిః
కృషోతుక్షత్రంనో అశ్వోవనతా హవిష్మాన్॥

తా॥ చదువబడుచున్న అశ్వము మాకు సకలమును బోషించునట్టి మంచి గోవులు గలట్టి ధనమును కలిగించును గాక! హవిస్సుగానైన యీ యశ్వము మాకు క్షాత్రతేజము గలిగించునుగాక ! దైన్యములేని అశ్వము పాపము లేకుండ జేయుగాక ! అట్లు కొన్ని మంత్రములు చదివిన తదుపరి గుఱ్ఱమును బలిగ నివ్వవలెను.

ఈ యశ్వమేధము కేవలము పారలౌకిక విధియగుటయేగాక యైహిక కామ్యఫలప్రదాయిగరు, రాజగౌరవ స్థాపకముగను బరిణమించెను. ఋగ్వేదము 1వ మండలము 163 సూక్తములో యాగార్హమగు నశ్వర్ణనయు దానిని సూర్య యమాగ్నులతో బోల్చుటయు మొదలగు విషయాలున్నవి. మరియు –

"యేచార్యతే వచనం సంభరంతి" అనగా చంపిన యశ్వమును (కోసి పండినట్లు కనబడుచున్నది. "యత్తేగాత్రాదగ్ని నాపచ్యమానా" అని గుఱ్ఱము మాంసమును పచనము చేసినట్లు గలదు. "గాత్రాణ్యసినా మిధుకః" అనగా కత్తితో సశ్వావయవములను కోసినట్లు గలదు. (ఆంధ్ర ఋగ్వేదము 449 పుట). కావున మంత్రములలో హింస లేదను ఆర్య సమాజకుల మాటలు నిర్థకములు కావా?

## 4. అజామేధము

సర్వమును నడిపించువాడు పూషణుడు సర్వులను రక్షించువాడును అతడేయనియు, అతనికి మేకపై ప్రీతియనియు ఆర్యులు యజామేధమును చేయుచుండిరి. అశ్వమేధ సమయమున యితర జంతువులతో బాటు మేకలను బలిగనిచ్చుటయు గలదు. అశ్వమేధ సమయమున చదువబడు ఋగ్వేద మంత్రములలో మేకను గూర్చియు కొన్ని మంత్రములు గలవు. ఋగ్వేదము ప్రథమ మండలము 162వ సూక్తము 3వ ఋక్కునందు – ఈ మేక సర్వ దైవములకు ప్రీతిగ పూషణుని భాగముగ నేర్పడి గుఱ్ఱము వెంబడి ముందరికి తీసికొనిపోబడును. త్వష్ట్ర బలికి నర్హమగు అశ్వమువెంట దానితో యశో మార్గమునకు బంపబడును అని గలదు.

ఆర్యులు పూర్వ కాలమున దైవములకుగాను, అజామేధమునెటులొనర్చునది మున్ముందు వివరింపబడును. స్మార్తులు నేటికిని మేకను బలిగ నర్పించుచుందురు.

మహమ్మదీయులు కూడ యజ్ఞకర్మను సూచించు 'బకరీద్' (అనగా యజామేధము) అను పండుగను ఆచరించుచున్నారు. దానికి 'ఈ దిఖోర్బాన్' 'ఈదుల్ జుహ' బల్యర్పణ పండుగ అను నామములు కలవు. అది వారికి మిగుల పుణ్యకరమైనదియు, ప్రతి మహమ్మదీయుడు నాచరింపవలసినదై యున్నది.

మహమ్మదువారు ఈ పండుగను ఆచరించునప్పుడు రెండు మేకపిల్లలను తెప్పించి దానిలో నొకదానికి తన నిమిత్తమును తన కుటుంబము నిమిత్తమును, రెండవదానిని ముస్లిముల నిమిత్తమును దేవునికి బలిగా నర్పింతురు. "బకరీదు" పండుగనాడు ముసల్మానులు చేయు "పజు" అను పేరుగల హస్తపాదాద్రి ప్రక్షాళనలో – "ఓ దేవా ! ఈ బల్యర్పణను మా పాప పరిహారము కొరకు అంగీకరించి మాలోని దుర్మార్గములు తీసివేసి మా మతమును పవిత్రము చేయుమని స్మరింతురు.

యూదులు కూడ అజామేధమును చేయుచుందురు. దీని విషయమై క్రీ.పూ. 1500సం॥ పూర్వమే వ్రాయబడిన వారి ధర్మశాస్త్రమునందు వ్రాయబడినదేమనగా యాజకుడు ఇశ్రాయేలీయుల సమూహము నొద్ద నుండి పాపపరిహారార్థబలిగ నొక పొట్టేలును తీసుకొని రావలెను. అప్పుడు పాప పరిహారార్థ బలిగ నొక మేకను యాజకుడు వధించిన తదుపరి రెండవ మేక

తలమీద తన రెండు చేతులు వుంచి ఇశ్రాయేలీయుల పాపములన్నియు, వారి యతిక్రమములన్నియు దానిమీద నొప్పుకొని, ఆ మేక తలమీద వాటిని మోపి, తగిన మనుష్యునిచేత అరణ్యములోనికి పంపవలెను. ఆ మేక వారి దోషములన్నిటిని ఎడారి ప్రదేశమునకు భరించి పోవును. యాజకుడగు 'అహరోను' తనకొరకు, ప్రజలకొరకు దహనబలిని అర్పించి, తన నిమిత్తమును ప్రజల నిమిత్తమును ప్రాయశ్చిత్తము చేయవలెను. (లేవీయకాండము 16 అధ్యా. 15, 21-24 వచనములు).

### 5. రాజసూయము

అశ్వమేధము చేసిన తరువాత సార్వభౌమాధికారమును సూచించుటకై చేయబడినది రాజసూయము, రాజసూయమందు రక్తము చిందింపరాదు. ధర్మరాజు ఒనర్చిన రాజసూయమందు కృష్ణుడు తన మేనత్త కుమారుడగు శిశుపాలుని శిరస్సు ఖండించుట చేతనే పాండవులు అరణ్యవాసము చేయవలసి యుందునని వ్యాసుడు ఆ సమయమున యధిష్టరునకెఱింగించెను. రాజసూయమందు సద్యోఘృతమును అగ్నిహోత్రమందు దహింతురు రాజసూయయాగ సమయంబున చక్రవర్తి బ్రాహ్మణులకు ఆయా దానము లొసంగి సత్కరించును.

### 6. వాజపేయము

రాజసూయమనంతరం రారాజు వాజపేయమును చేయవలెను. అప్పుడు పురోహితుడు అతనితో నీవు బలియై తిరిగి రావలెనని చెప్పును. అంతట చక్రవర్తి నేనెటుల చనిపోయి తిరిగి బ్రతకగలనని చెప్పినంత పురోహితుడు నీవు కాదు, రానున ప్రజాపతియే ప్రజల రక్షణార్థము మృతిజెంది తిరిగి బ్రతికి రాజ్యమేలునని చెప్పి ఒక పొట్టేలును అతనికి బదులుగా బలి చేయును.

"అశ్వమేధ తంత్రము" అను సంస్కృత గ్రంథమును పఠించినయెడల అశ్వమేధ, గోమేధ, నరమేధ, అజామేధాది యజ్ఞముల సంగతి విశదముగా తెలియగలదు. ఈ గ్రంథము మదరాసునందుగల అడయారు గ్రంథాలయములోను, తార్‌వాలాఫాల్ లైబ్రరీ, బొంబాయిలో మాత్రమే లభ్యము కాగలదు. పైనుదహరించిన యాగములేకాక పంచయజ్ఞములను గూర్చి మనువు వ్రాసెను. అవి ప్రస్తుత కాలములో ప్రాముఖ్యతనందియున్నవి. అవేవనగా –

శ్లో॥ ఋషి యజ్ఞః దేవ యజ్ఞః భూతయజ్ఞంచ సర్వదా ॥
నృయజ్ఞ పితృ యజ్ఞంచ యథాశక్తి సహాపయేత్॥
(మనుస్మృతి 4అ. 21 శ్లో)

శ్లో॥ అధ్యాపనం బ్రహ్మయజ్ఞః పిత్రుయజ్ఞశ్చ తర్పణమ్ ।
హోమో, దైవో, బలిర్భూతో, నృయజ్ఞో అతిథి పూజనమ్॥
(మనుస్మృతి 3అ. 70 శ్లో)

1. దేవ యజ్ఞము – అగ్ని హోత్రునియందు దేవతలకు హోమము చేయుట;
2. పితృ యజ్ఞము – పితరులకు స్వభాకారముతో జలతర్పణాదులు;
3. భూత యజ్ఞము – ఆయా జీవులకు భూతములకు అన్నదానాది బలిదానము.
4. మనుష్య యజ్ఞము – అతిథులకన్నదానము
5. బ్రహ్మ యజ్ఞము – వేదమును పఠించుట.

"దైవోబలి" ఇదియు పంచయజ్ఞములోనిదేయని కొందరందురు. దోషముల నిమిత్తము పరిహారార్థముగ పంచ యజ్ఞములను చేయవలెను. లేకున్న దుఃఖము దుర్గతి తప్పదని హైందవుల నమ్మకము.

ఎవరి పాపములను వారు అనుభవించినరీతి వాటి ఫలితమును కూడా అనుభవించవలసినదేయనియు, పాపక్షమాపణకు మార్గమే లేదనియు వాదించినచో ఆర్యులు వరుణుని ఏమని ప్రార్థించిరో గమనించుడ :

మం॥ అవతే హేళో వరుణ నమోభిరవ యజ్ఞేభిరీ మహేమవిర్భిః !
క్షయన్న స్మభ్య మసురప్రతచేతారాజన్నేంనాంపిశిశ్రధః కృతాని ॥

తాత్పర్యము : రాజగు వరుణా ! నీ కోపమును నమస్కారములతో బోగొట్టుకొనుచున్నాము. యజ్ఞములచేతను హవిస్సులచేతను బోగొట్టుకొనుచున్నాము. అనిష్టము దొలగించునట్టి యో వరుణా ! "మాకొరకిచ్చట నివసించుచు మేము జేసిన పాపములను వదలించుము" ( ఆంధ్ర వేదము 54వ పుట 267వ ఋక్కు).

పైరీతిగా ప్రార్థించిన ఆర్యులు దైవావతారము నపేక్షించినటుల కూడా విశదమగుచున్నది. వరణుడు సర్వత్రా వ్యాపించి యుండువాడని ఆర్యులు నమ్మినయెడల తమ మధ్య అతడు నివసింపవలెనని ఎట్లు ప్రార్థించగలరు? గావున కర్మఫలమనుభవించి తీరవలసినదేయనియు, దేవునికవతారమే లేదనియు వాదించువారి మాటలు వేదోక్తులకెట్లు సరిపోగలవు?

పూర్వకాలమందు ఆయా మతస్థులొనర్చుచుండిన బలులేమి ఆర్యులొనర్చిన నరమేధ, అశ్వమేధ, అజమేధాది యజ్ఞములేమి సూర్యోదయమునకు పూర్వము రాత్రివేళ ప్రకాశించు నక్షత్రములు రానున్న దివాకరుని సూచించు విధమున సృష్టికర్త మానవ రక్షణార్థమై భువిపై నవతరించి చేయనైయున్న మహాయజ్ఞమునకు ఛాయామాత్రములై యుండెను. ఇందుకు ప్రమాణము వేదశాస్త్రములేమని వాకొనుచున్నవో గమనింతుము.

అ) ప్లవాహ్యతే అదృథా యజ్ఞరూపాః
(మందకోపనిషత్తు 2వ ఖండము, 7వ మంత్రము)
అనగా యజ్ఞరూపములగు తెప్పకొయ్యలు గట్టివి కావు

ఆ) ప్లవాహ్యతే సురా యజ్ఞాః న సంశయః ॥
(స్కాంద పురాణము, యజవైభవ ఖండము 7వ అ.)
ఓ దేవతలారా ! యజ్ఞములు తెప్పకొయ్యలవంటివి.
అవి గట్టివి కాదనుటకు సంశయము లేదు.

ఇ) యజ్ఞోవా అపతితస్య ఛాయా క్రియతే॥
(తాండియ మాహా బ్రాహ్మణము)
(ప్రజాపతి) యజ్ఞమే రక్షించుచున్నది
దానియొక్క ఛాయయే జరుపబడుచున్నది

ఈ) ఆత్మదా బలదాః యన్యఛాయామృతం, యన్య మృత్యుః
(ఋగ్వేదము 10 మం. 121 సూ. 2 ఋక్కు)

అనగా యెవని యొక్క ఛాయయును మృత్యువును అమృతమగునో అతని ఛాయా మృత్యువులు ఆత్మలకు బలమునిచ్చునవిగ నున్నవనియు జెప్పబడియుండుటచే ప్రాచీనులర్పించు బలులు జగద్రక్షకుని బలికి సూచనలు మాత్రమే. మరియు "వ్యవస్థా భవిష్యన్మజ్ఞలానాం ఛాయా రూపాతతో హేతోర్నిత్యం దీయామానై రేక విధైర్వాషిక బలిభిః శరణాగత లోకాన్ కర్త్యుం కదాపిశక్తో" అనగా ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయ గలదియేగాని, వస్తువుల నిజస్వరూపముగలది కాదు. కనుక యాజకులు ఏటేట యెడతెగకుండ అర్పించు ఒక్కటే విధమైన బలులు శరణాగతులకు ఎన్నడును సంపూర్ణసిద్ధి గలుగజేయనేరవు. ఐతరేయ బ్రాహ్మణమునందు –

శ్రు॥ యజమానః పశుః యజమానమేవ సువర్గలోకం గమయతీ॥

అనగా యజ్ఞము చేయువాడే యజ్ఞపశువు. అతడే స్వర్గలోకమేగునని కలదు.

శతవధ బ్రాహ్మణమునందు "ప్రజాపతి ర్యజ్ఞం" అనగా ప్రజాపతియే యజ్ఞమనియు "తస్య ప్రజాపతేరర్థమేవ మర్త్యా మాసీరర్థ మమృతం" ఆ ప్రజాపతి సగము మర్త్యుదుగను సగము అమర్త్యుదుగనుండి మర్త్య శరీరమును బలిగనిడి, అమర్త్య శరీరముచే మృత్యువు నోడించుననియు కలదు. సామవేద తాండియ మహా బ్రాహ్మణములో –

శ్రు॥ ప్రజాపతిర్దేవేభ్య ఆత్మనాం యజ్ఞం కృత్వా ప్రాయశ్చిత్ ।

అనగా ప్రజాపతి ఆత్మల రక్షణార్థము (తనను తానే) యజ్ఞముగా సమర్పించుకొని ప్రాయశ్చిత్తము చేసెననియు, బృహదారణ్యకోపనిషత్తు నందు –

"సోకామయతే నేపధ్యంను ఇందస్సాత్ ఆత్మస్యనేనస్సామ్" అనగా నతడు యజ్ఞములకు తగిన రూపమును ధరించుకొనవలెనని కోరుకొనెననియు, ఋగ్వేదమందు –

శ్రు॥ విశ్వకర్మా సర్వాణి భూతాని జుహవాంచకార ।
స ఆత్మామంతతో జుహవాంచకార॥

అనగా సృష్టికర్త సకల సృష్టములను బలిగనిచ్చి తుదకు తానే బలిగ నర్పించుకొనెననియు వ్రాయబడుటచే లోకాధిపతియగు నా పరాత్పరుడు మర్త్యామర్త్యమును వహించి, దైవమానవుడై యవతరించి ఈ భూలోకమందు తానే యజ్ఞపశువై మానవులను తరింపజేయుటకై యజ్ఞమగుటయే నిజమగు ముక్తిదాయకమగు మహాయజ్ఞమని తెలియుచున్నది.

దేవుడు భూలోకమందు అవతరించినగదా ఆయన పాప ప్రాయశ్చిత్తార్థ బలిగా – తానే బలిగ అర్పించుకొనుట అని యందురేని దేవునికి అవతారమున్నట్టు వేదశాస్త్రములే సాక్ష్యమిచ్చుచున్నవి. (ఋగ్వేదములోని 10వ మం॥ 90వ సూక్త 7వ ఋక్కునందు).

శ్రు॥ అజాయ మానో బహుధా విజాయతే ।
తస్యధీరాః పరిజానంతియోనిమ్॥

అనగా జన్మించినవాడు తరచుగా జన్మించుచున్నాడు. దానియొక్క కారణమును పండితులు తెలిసికొనుచున్నారు. దీనిని బట్టి దేవునికవతారమున్నట్లు తెలియుచున్నది. ఈ మంత్రమును అవతారపరముగానే మధ్వరామానుజాచార్యులు భాష్యమందు వ్రాసిరి. ఈ ఋక్కుతైత్తె యారణ్యకము 3వ ప్రపాఠకమందును, శుక్ల యజుర్వేదము యొక్క 31వ మండలమందును, అథర్వ వేదముయొక్క 19వ కాండమందును ఉన్నది.

"నారాయణ" శబ్దార్థములోనే దేవుడవతారమెత్తునను విషయము స్పష్టమగుచున్నది. "నరస్సేదం నాశం అవతారేషు నారంవపురయితి నారాయణః" (గురుబాల ప్రబోధిక) నరసంబంధమైన శరీరము నారము; అవతారములయందు నరశరీరమును బొందువారు నారాయణుడని భావము. మరియు 'స్వయంభువు' శబ్దార్థమును బట్టి (యంః స్వయం భవతి సస్వయాం భూరీశ్వరః ) తనంతట తానే పుట్టినవాడు, ఎవనినుండి గాని, దేనినుండిగాని యుత్పన్నమైనవాడు కాదు; కాబట్టి పరమాత్మకు 'స్వయంభు'వని పేరు దేవుడు సర్వశక్తిమంతుడు గనుక అవసరమైనయెడల అవతరించగలడు. మృత్యువునొంది మృతిని గెల్వగలడు గనుక మృత్యుంజయుడనియు ఆయనకు పేరు కలదు.

**ప్రశ్న :** నేపదార్థము యొక్క స్వరూప మేక దేశీయమో దాని గుణకర్మ స్వభావములను ఏక దేశీయములగును గదా? అటులేనియతడు ఈశ్వరుడు కాజాలను. ఎందుకన ఈశ్వరుడు సర్వవ్యాపకుడుకదా?

**జవాబు :** దేవుడు పరలోకమందు స్థిరముగనున్నను వేగముగ పరుగెత్తుచున్న నితర వస్తువులను అతిక్రమించుచున్నారు. సర్వ ప్రపంచము పరమాత్మయందు ఏక దేశీయమై యుండినను ఆయన ప్రతి పరమాణువు నందునుండగలడు. ఆయన దూరముననున్నాడు, దగ్గరున్నాడు. ఏకకాలమునందే భూమ్యాకాశములందుండగల విభుడగుటచే ఆయన మానవ రక్షణార్థము భువిపై నవతరించిన మాత్రమున ఆయన సర్వవ్యాపకత్వాది గుణములు నష్టమైపోవు. ఆయన సర్వశక్తిమంతుడు.

సూర్యుడు గగనమందొక స్థలమునవేయబడినను అతని స్వరూప కాంతులను అనేక దేశస్థులు ఏకకాలమందే జూచుట లేదా?

దేవునిచే సృజించబడిన ఒక జ్యోతికే అంత శక్తిసామర్థ్యములు కలిగియుండ ఇక దేవుడెంత సమర్థుడో యెవరికెరుక?

**1) జననము :** మనుష్యుడు దేవుని కుమారుడై యుండుటచే ప్రతివాని యందు భగవదంశయందును. **2) ఆవేశము :** జ్ఞానులు పలుకు వాక్కు పరబ్రహ్మ స్వరూపమందురు. ఋషి, ప్రవక్త సైగంబరు, దీర్ఘదర్శి దైవాత్మచే ఆవేశింపబడి దేవోక్తులు పలుకుచుందురు. **3) అవతారము.** ఇది మానవ బుద్ధికి అందదు. కాని దానిని అంగీకరించవలసినదేనని బుద్ధిమంతులు చెప్పుదురు.

దేవుడు తన భక్తులగు దీర్ఘదర్శులకు లోక రక్షణార్థమై చేయనున్న యజ్ఞములను వందల, వేల సంవత్సరములకు పూర్వమే

తపస్సమాధిలోనో లేక దర్శనాయంత్రమందో ప్రత్యక్షపరచుటచే వారు జరుగనున్న ఆ మహా బలిని భూత భవిష్యత్కాలానుగుణముగా ప్రవచించిరి.

ఆర్య, యూదా, మహమ్మదీయ మత గ్రంథములందు గల "అజామేధము"ను గురించి తెలిసికొంటిమేని అది జగద్రక్షకుడగు ప్రజాపతి చేయనైయున్న మహా యజ్ఞమున కెట్లు సాదృశ్యముగానున్నదో గ్రహించగలము.

**అజామేధము**

1. మచ్చలేని మేక కావలెను.
2. దాని తలకు బలుసుకంప చుట్టవలెను.
3. దానిని యూప స్థంభమునకు కట్టవలెను.
4. నాలుగు కాళ్ళలోను మేకులు కొట్టవలెను.
5. మేకకు కప్పిన పచ్చడమును నలుగురు ఋత్వికులు పంచుకొనవలెను.
6. దాని ఎముకలలో నొకటియు విరువరాదు.
7. మేకకు సోమరసము త్రాగించవలెను.
8. దానిని వధించిన పిమ్మట ప్రాణప్రతిష్ఠ చేయవలెను.
9. దాని మాంసమును భుజింపవలెను.

అని వివరింపబడుటచే రానున్న నిష్కళంక దైవావతారమూర్తి యొక్క లోక రక్షణార్థ మరణమందు పై సూచనలకు సరియైన యర్థానుగుణ్యమగు సంగతులు జరుగవలెనని బోధపడుచున్నది. కాని భగవంతుడవతరించి పాపులను రక్షించుటకై యజ్ఞపశువుగా చనిపోయి మృత్యుంజయుడైనట్లు మన దేశపు అవతార చరిత్రలయందు గానరాదు. అయితే మన ఆసియా ఖండమందే మధ్యధరా సముద్ర తీరమందున్న భూమధ్య దేశమగు పాలస్తీనా దేశము ( ఇశ్రాయేలు) నందొక పరిశుద్ధ కన్యక గర్భమున నుద్భవించిన దైవావతారునియందీ లక్షణములన్నియు నున్నటుల గ్రహించగలము. కేవలము నిష్కళంకుడై పరమ పవిత్ర జీవితము గలిగియుండి మర్త్యా మర్త్యతలు అనగా దైవత్వ, మానవత్వములు మూర్తీభవించి కలసియుండిన ఈయన తాను మానవ రక్షణార్థము యజ్ఞమై చనిపోయి మృత్యుంజయునినై జీవింతునని మొదటినుండియు చెప్పియుండెను. పాపాసక్తులై ఈయన బోధనా జీవితము జూచి అసూయచే తనను జంపనుద్దేశించిన దుర్మార్గులకు తనంతట తానే పట్టుబడి, పురుష సూక్తమందటి విరాట్పురుష యజ్ఞమువలె నా దుష్టులచే జంపబడి మరణమును జయించి లేచిన విధమును జూడగా ఋగ్వేదమందు యజ్ఞ పశువునుగూర్చి వివరింపబడినదంతయు నీ క్రింది విధముగా నీయనయందు నెరవేరినట్లు విశదమగుచున్నది.

| యజ్ఞపశువు | క్రీస్తు |
| --- | --- |
| 1. మచ్చలేని మేక యున్నటుల. | ఈయన పాపములేని దైవ మానవుడు |
| 2. దానితలకు బలుసుకంప చుట్టిరి. | ఈయన తలకు ముండ్ల కిరీటము బెట్టిరి. |
| 3. దానిని యూప స్థంభమునకు గట్టిరి. | ఈయనను సిలువయను కొరతమ్రానిపై నంటగట్టిరి. |
| 4. దాని నాలుగు కాళ్ళలోను రక్తము కారునట్లు మేకులు కొట్టిరి | ఈయన హస్తపాదములందు ఇనుప మేకులు కొట్టిరి. |
| 5. మేకకు కప్పిన పచ్చడమును నలుగురు ఋత్విక్కులు పంచుకొనిరి | క్రీస్తును సిలువ వేసినవారు ఆయన వస్త్రమును పంచుకొనిరి. |
| 6. దాని ఎముకలలో నొకటియు విరువకూడదు. | ఈయన ఎముకలలో నొకటియు విరువబడలేదు. |
| 7. మేకకు సోమరసమును త్రాగించిరి. | ఈయనకు చిరకనిచ్చిరి. |
| 8. వధానంతరము దానికి ప్రాణప్రతిష్ఠ చేయవలెనన్నట్లు | ఈయన మృత్యుంజయుడై లేచెను. |
| 9. దాని మాంసము భుజింపవలెనన్నట్లుగా. | క్రీస్తు లోకరక్షణార్థమై – |

తాను యజ్ఞముగా నర్పించుచున్న తన శరీర రక్తములను తన భక్తులు భుజించి పానించవలెననియు, అందుకు సూచనగా తన మరణమును తరచుగా జ్ఞాపకము చేసికొనుచు, రొట్టెను మరియు ద్రాక్షారసమును పుచ్చుకొనవలెననియు, తన మరణాత్పూర్వము తన భక్తుల కాజ్ఞాపించి యొక ఆచారమును నిర్ణయించెను. ఇప్పటికిని అట్లే జరుగుచున్నది.

ఇట్లు ఇశ్రాయేలు దేశములో వెలిసిన దైవావతారమందే పాపాత్ముల రక్షణకై ప్రాయశ్చిత్తార్థ యాగము నెరవేర్చబడియుండుటచే, నిదియే పాపాత్ములు ముక్తికై నమ్మవలసిన సత్యమైన విరాట్పురుషావతారమని స్పష్టమగుచున్నది. ఈ సత్యమును ఇంకను గ్రహించక ఐతరీయ బ్రాహ్మణ్యములో వ్రాయబడినరీతి నేటికి స్మార్తులు మేకను బలిగ నర్పించుచున్నారు. మరికొందరు పిండితో మేకనుజేసి అర్పించుచున్నారు. మహమ్మదీయులు యజ్ఞ కర్మను సూచించు "బకరీదు" యను పండుగ నాచరించుచున్నారు. అట్లే యూదులును ఆయా బలులర్పించుచున్నారు. అట్లే అయితే యజ్ఞయాగములను గురించి సత్యవేదమందేమని వ్రాయబడియున్నదో గమనింపుడు.

"యత ఏతాని ఛాయా స్వరూపాణి. క్రీస్తు సత్యమూర్తి ః క్రీష్ణః అనగా ఇవి (బలులు) రాబోవువాటి ఛాయయే గాని నిజ స్వరూపము క్రీస్తులో యున్నది. (కొలొస్స 2 అ. 17వ) లోకపాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల క్రీస్తే సుమా ! (యోహాను 1:29).

వేదములందు వ్రాయబడిన నరమేధ, అశ్వమేధ, అజామేధాది యజ్ఞములు క్రీస్తు సిలువమ్రానుపై నెరవేర్చి మహాయాగమునే సూచించుచున్నవి.

యుగయుగముల తన రక్షణ సంకల్పమునుబట్టి జగద్రక్షణకై తనను తానే సమర్పించుకొనిన పరమాత్ముడు తన ప్రవక్తకకు దర్శనమును గ్రహించినప్పుడు అతడిట్లు వచించెను. "తతో జగతః సృష్టి కాలాచ్ఛేదిత స్సమేషవత్సః" (ప్రత్యక్షీకరణము 13:8).

అనగా జగదుత్పత్తి మొదలుకొని వధింపబడియున్న గొఱ్ఱెపిల్ల క్రీస్తు ఎప్పుడు సిలువ వేయబడెను? లోకము పుట్టుటకు పూర్వమే. ఆయన లోకమందవతరించి యిప్పటికి 2000 సం॥లే గదా? అవును; కాని ఆయన లోకము పుట్టుటకు పేర్వమేయున్నవాడు. యోహాను 17:5-24వ. అప్పుడాయన చేసిన యజ్ఞమేది? అదియే ఋగ్వేద పురుష సూక్తమందు వివరింపబడిన మానవ యజ్ఞము కావుననే "యాగ మాచరణ సహాయమున ప్రపంచముద్భవించెను. ఆ శక్తి సహాయమున ప్రపంచము నిలిచినది. ప్రపంచము యొక్క గర్భమే యాగమ విధియని వేదము పల్కెను. ఋగ్వేదము ప్రథమ మండలము 164వ సూక్తములో ఒక వేదాంతి ఇట్లు చెప్పెను - Through the outer cross I see the inner Cross (unseen Cross) అనగా బాహ్య సిలువద్వారా నేను అంతరంగ సిలువను చూచితిని. అయితే కాలము సంపూర్ణమైనప్పుడే ఆయన లోకములో అవతరించి భూత, వర్తమాన, భవిష్యత్కాలములకు సరిపోగల ఒకేనొక మహా యజ్ఞము నెరవేర్చెను. (గలతీ 4:4; హెబ్రీ 9:26).

**ప్రశ్న :** క్రీస్తుకు పూర్వకాలమందున్న పిలాతు గతి ఏమి?

**జవాబు :** క్రీస్తు బలి ద్వారానే భక్తులగు పితరులు పరలోకగతులైరి. అంతదనుక వారు స్వర్గ పాతాళ లోకములకు భిన్నమైన నొక స్థలమందుండిరి. దీనినే అదృశ్య లోకము లేక పరదైసు యందురు. (లూకా 16:22,23). సమూయేలు అనబడిన ప్రవక్త అచటనే యుండెను. పితృ దేవతలలోనుండి అతడు పైకి వచ్చి సౌలు రాజుతో మాట్లాడెను (1 సమూయేలు 28:13-15). రక్షకుడు సిలువ వేయబడినప్పుడు ఆయనతోకూడా సిలువ వేయబడిన యిద్దరు దొంగలలో నొకడు పశ్చాత్తాపపడి - యేసూ, నీవు నీ రాజ్యముతో వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుము అనెను. అందుకాయన వానితో నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను. కావున క్రీస్తు లేఖనము ప్రకారమే సిలువ వేయబడి చనిపోయినంతనే అదృశ్య లోకమగు పరదైసులోనికి దిగి అచ్చటగల పితరులతో మూడు దినములుండి మరణమును జయించి లేచి తన బలికై నిరీక్షించి తాత్కాలిక యజ్ఞ యాగములు చేసి ఆయన ధర్మశాస్త్రానుసారముగా నడుచుకొనిన ప్రాచీనులకు సద్గతి నొసంగుటకై వారిని పరలోకమునకు చేర్చెను. అందుచేత ఆయన ఆరోహణుడైనప్పుడు చెరను చెరగా పట్టుకొనిపోయి మనుష్యులకు ఈవులను అనుగ్రహించెనని ప్రవక్త చెప్పుచున్నాడు. ఆరోహణమాయెననగా (మొదట) ఆయన భూమి యొక్క క్రింది భాగములకు దిగెననియు అర్థమిచ్చుచున్నది గదా. దిగినవాడు తానే సమస్తమును నింపునట్లు ఆకాశమండలము లన్నిటికంటె మరిపైకి ఆరోహణమైన యున్నాడు (ఎఫెసీ 4:8-10). ఐతరీయా బ్రాహ్మణములో వ్రాయబడినదేమనగా - పూర్వకాలమున దైవములు (ఆర్యులు) మానవుని బలిగ నిచ్చుచుండిరి. అప్పుడు బలిసారము మానవునినుండి వెడలి గుఱ్ఱమును వదలి ఎద్దును చేరెను. దానిని గని ఎద్దును బలిగా నిడిరి. అది మేకను జేరగా దానిని బలిగ నిడిరి. బలిసారము భూమిలో జొచ్చెను. దానిని వెదకుటకు భూమిని

త్రవ్విరి. బలిసారము బియ్యములోను, గోధుమలోను జేరియుండెను. పశ్వాది బలులనుండి ఎంత బలిసారము దొరకుచుండెనో అంత సారము బియ్యమునందును గోధుమలందును నుండుటచే తెలిసినవారీ వస్తువులనే బలి (పూజా ద్రవ్యము)గ నిడుదురు.

యూదులు కూడా గోధుమపిండిలో నూనెపోసి సాంబ్రాణి వేసిన నైవేద్యమును యెహోవా దేవునికి బలిపీఠము మీద హోమముగా దహించిరి. (లేవీయకాండము 2:1-3). కాబట్టి క్రీస్తు ప్రభువు తననుతానే గోధుమ గింజతో పోల్చుకొని తాను సిలువ వేయబడినప్పుడు అనగా బలియైనప్పుడు అందరిని తనయొద్దకాకర్షింతునని చెప్పెను. (యోహాను. 12:23-32).

భూమి నుండి మొలచిన సత్యము క్రీస్తే (కీర్తన 85:11). నేనే సత్యమును జీవమునై యున్నాను అని ఆయన చెప్పెను (యోహాను. 14:6).

ఆత్మీయమైన ఆకలిదప్పులు గలవారు జీవాహారమైన క్రీస్తును భుజించి, అనగా ఆత్మీయముగా ఆయన శరీరము తిని ఆయన రక్తము త్రాగినచో నిత్య జీవము గలవారై యుందురు. వారు మరణించినను అంత్యదినమున వారిని లేపుదునని ప్రభువు సెలవిచ్చెను (యోహాను 6:35; 52:58).

ఇక్కాలపు హైందవులాచరించు పంచయజ్ఞములు కూడా క్రీస్తు రక్షణార్థమై చేసిన మహాయజ్ఞమందే కలసిపోయినవి. ఎట్లనగా -

**1) దేవయజ్ఞము :** దైవత్రిత్వములో రెండవవాడగు క్రీస్తు (దేవునిలో దేవుడై యుండి) యజ్ఞ పశువుగా వధింపబడి దేవునికి ప్రీతికరమగు హోమమాయెను.

**2) పితృ యజ్ఞము :** పితరులకు క్రీస్తు బలిద్వారా సంపూర్ణసిద్ధి కలిగెను (హెబ్రీ 11:40). ఇందుకు సాక్ష్యముగా సమాధులు తెరువబడెను. చనిపోయిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేపబడెను. (మత్తయి 27:52).

**3) భూత యజ్ఞము :** క్రీస్తు సిలువవేయబడుటచే పశుబలి నాపి ప్రపంచ పునర్జన్మకు పునాది వేసెను. (రోమా 8:21). రానున్న క్రీస్తు రాజ్యములో హింసలేనందున క్రూర జంతువులు సాధు జంతువులతో నుండి గడ్డి మేయును (యెషయా 11:6-9).

**4) మనుష్య యజ్ఞము :** పాప, మరణ, నరకములనుండి మానవులను విడిపించుటకై ఆయనే బలియాయెను. (రోమా 6:14; హెబ్రీ 2:14,15; రోమా 8:1).

**5) బ్రహ్మ యజ్ఞము :** క్రీస్తే దేవుని వేదము అనగా జ్ఞానము. (1 కొరింథీ 1:24). ఆయనే వాక్యమై యున్నాడు (యోహాను 1:1). కనుక అక్షర బ్రహ్మమగు ఆయనను ప్రతిదినము పఠింపవలెను.

మానవులొనరించెడి పంచ మహా పాతకముల పరిహారార్థమై రక్షకుడు పంచ గాయములను బొందెను. సిలువను గూర్చి వార్త నశించుచున్నవారికి వెర్రితనముగాయున్నది. గాని రక్షింపబడుచున్నవారికి దేవుని శక్తి, దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానముచేత దేవునిని ఎరుగకుండినందున సువార్త ప్రకటనయను వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుటకు దేవుని దయాపూర్వక సంకల్పమాయెను (1 కొరింథీ 1:18,21).

**ప్రశ్న :** యజ్ఞము లేకుండా దేవుడు పాపములను క్షమించలేడా? ఆయన కృపగలవాడుగదా !

**జవాబు :** దేవుడు సత్యమై యున్నాడు. ఆయన ప్రేమయైయున్నాడు. సత్యమునుబట్టి ఆయన పాపులను శిక్షించవలసియున్నది. ఆయన ప్రేమగలవాడు గనుక కృపతో పాపులను క్షమింపవలెను. అయితే కృపా సత్యములు ఒకదానికొకటి విరుద్ధములై యున్నవి. సత్యము నెరవేర్చవలెనన్న కృపయు, కృపను నెరవేర్చవలెనన్న సత్యమును అడ్డగించును.

శిబిచక్రవర్తిని గూర్చి గాక ఈ విషయమున స్మరించుట యవసరము. శిబి చక్రవర్తి దయగలవాడగుటచేత తన శరణుజొచ్చిన పావురమును రక్షింతునని అభయమొసంగెను. అంతట డేగ యొకటి అచ్చకరుదెంచి తానా పావురమును భక్షింపకున్నచో ఆకలిచే మరణింతుననియు, న్యాయము చొప్పున జరిగింపగోరినచో ఆ పావురమును వదలక తప్పదనియు వాదించెను. అప్పుడు శిబి బాగుగా ఆలోచించి ఆ పావురమంత మాంసమును డేగకిచ్చుటకు ఒప్పించి తుదకు తానే తన మాంసమును బలిగా డేగకర్పించెను. గనుక కృపా సత్యములకు చిహ్నములైన ఆ రెండు పక్షులు సంతసించి రాజీపడెను. ఇదే సత్యమును పరిశుద్ధ గ్రంథము బోధించుచున్నది సుమా ! ఆదియందు వాక్యమైయున్న అనగా శబ్ద బ్రహ్మమగు ఓంకారమైయున్న దేవుడే శరీరధారియై కృపాసత్య

సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను (యోహాను 1:1-5, 14). దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరాకారముగా క్రీస్తునందు నివసించుచున్నది. (కొలొస్స 2:9). పాపులను రక్షించుటకై క్రీస్తు సిలువ వేయబడుటచే మానవులు పొందవలసిన శిక్షను తానే పొంది సత్యమును నెరవేర్చెను.

అట్లే వారి పాపములను క్షమించి కృపను నెరవేర్చెను. క్రీస్తును గూర్చిన సాక్ష్యము ప్రవచనామసారమైనది (ప్రకటన19:10). కావున దీర్ఘదర్శి క్రీ.పూ. 1000 సంII ల నాడే యిట్లు ప్రవచించెను - "కృపా సత్యములు కలిసికొనినవి; నీతి సమాధానములు ఒకదానికొకటి ముద్దుపెట్టుకొనినవి; భూమిలోనుండి సత్యము మొలచును. ఆకాశములోనుండి నీతి పారజూచును" (కీర్తన 85:10,11). ఈ వచనముల భావము క్రీస్తు సిలువవేయబడినప్పుడే నెరవేరెను, కాబట్టి మహా జ్ఞానియగు సొలోమోను చెప్పినట్లు 'కృపాసత్యములవలన దోషమునకు ప్రాయశ్చిత్తము కలుగును" (సామెతలు 16:6).

శ్లో॥ యద్గురుయజ్ఞ కర్మంచ, యజ్ఞంచ సర్వసిద్ధియేత్
యజ్ఞయేవ సర్వస్యాధ్యంచ, యజ్ఞకర్మ పరాత్పరమ్॥
(గురుగీతలు)

అనగా జగద్గురువు యజ్ఞము చేయగా ఆ యజ్ఞము వలన సర్వము సిద్ధించును. దానివలననే సర్వము సాధ్యమగును. (కావున) యజ్ఞకర్మయే పరాత్పరమైయున్నది. మరియు -

శ్లో॥ నపుణ్యం దానధర్మ నకర్మశ్చ పుణ్యం భవతే।
నపుణ్యో ప్రాణదసశ్చ జగత్పుణ్యం నాస్తి; నాస్తి ॥

అనగా దానధర్మములచేతను కర్మచేతను, పుణ్యము కలుగదు. ప్రాణదానము లేకుండ ప్రపంచమునకు పుణ్యమేలేదు. ఇట్లు ప్రాణదానము చేయ సమర్థుడు బరబ్రహ్మమగు గురువైయున్నాడు. "గురుదేవ పరబ్రహ్మ" మరియు "మంత్రోగురుః" మంత్రమే గురువు. (ఋగ్వేదము 1 మం. 147 సూ. 4 మ.).

"అమంత్రం అక్షరం నాస్తి" కావున ఆ గురువు మొదటి అక్షర బ్రహ్మమగు ఓంకారమే యోగదర్శనమందు పతంజలి ఇట్లు వ్రాసియున్నాడు. "తస్యవాచకః ప్రణవః" అనగా "ఓమ్" ఈశ్వరుని నామము. ఇట్లు ఆదియందు వాక్యమైయున్న క్రీస్తు యేసే నిజమగు గురువు తానేనని పలికెను. (మత్తయి 23:10). ఆది గురువు మహా దేవుడగు యేసుక్రీస్తే సుమా ! (తీతు 2:13). యోగదర్శిని ఈ విషయమునే సమర్థించుచున్నది. "స ఏషపూర్వేషామసి గురుః కాలేన, పచ్ఛేదాత్" (యోగదర్శిని 1:26). అనగా ఆ యేసు ఆది గురువైయుండి కాలముచేత వేరుచేయబడలేదు. "సత్యోమంత్రః సత్యము (ఋగ్వేదము 1:152-2) సత్యమే క్రీస్తు (యోహాను 14:6) కావున జగద్గురు యజ్ఞముద్వారానే తప్ప పాపక్షమాపణ కలుగదు.

దేవోక్తులు యూదులపరము చేయబడెను (రోమా 3:2). కావున యూదా ప్రవక్తలు క్రీస్తుయేసు సిలువనుగూర్చి వందల సంవత్సరములకు పూర్వమే తేటగా లిఖించిరి. వారిలో దీర్ఘదర్శియగు యెషయా క్రీ.పూ. 700సంII ల క్రిందట యిట్లు వ్రాసెను. "మన అతిక్రమ క్రియలనుబట్టి అతడు గాయపర్చబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది (యెషయా 53:5).

ప్రశ్న : మన పాపములకొరకు క్రీస్తు సిలువ వేయబడినచో ఒకని ఆకలికొరకు మరియొకడు అన్నము తినినయెడల మొదటి వాని ఆకలి తీరునా?

**జవాబు :** తల్లి ఆకలితీర అన్నము తినుటచే ఆమె పాలు త్రాగి బిడ్డ ఆకలి తీర్చుకొనగలదు. బిడ్డ జబ్బుకు తల్లి పథ్యము చేయుటచేతనే అతనికి ఆరోగ్యము చేకూర్చుచున్నది. ఒకరు వెలిగించిన దీపము అనేకులకు కాంతి నిచ్చుచున్నది. యేసుప్రభువు అందరికి తల్లివంటివాడు. ఆయనే లోకమునకు వెలుగై యున్నాడు. (యోహాను 8:12). ఋణస్థుడు అప్పు చెల్లించనియెడల మధ్యవర్తి చెల్లించవలసియుండును.

"దేవుడొక్కడే, దేవునికి నరులకును మధ్యవర్తియు ఒక్కడే. ఆయన క్రీస్తుయేసను నరుడు" (1 తిమోతి 2:5) మరియు "మధ్యవర్తి ఎవనికి మధ్యవర్తి కాదు. కాని దేవుడొక్కడే" (గలతీ 3:20).

క్రీస్తు అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చితినని చెప్పెను (మత్తయి 20:28).

ప్రశ్న : ద్విజత్వమెట్లు సిద్ధించును?

జవాబు : శ్రు ॥ జన్మనాజాయతే శూద్రః కర్మణాజాయతే ద్విజః వేదపాఠంతు విప్రాణాం. బ్రాహ్మజ్ఞానంతు బ్రాహ్మణః అను వజ్రసూచికోపనిషత్తు వాక్యానుసారముగా పుట్టుకచేత ప్రతివాడు శూద్రుడై కర్మచేతనే ద్విజుగడగుచున్నాడు. ద్వి = అనగా రెండవసారి; జ = జన్మించుచున్నాడు. అట్టివాడు వదపఠనచే విప్రుడును, బ్రహ్మ జ్ఞానముచే బ్రాహ్మణుడునగుచున్నాడు. జందెము వేసికొనుట వలన శూద్రత్వము పోదు; కాని యజ్ఞకర్మవలననే ద్విజత్వము వచ్చుననుట నిశ్చయము. క్రీస్తు బలివలననే మనము ద్విజులమై దేవుని రాజ్యమునకు వారసులము కాగలము. “అతడు తనకుతానే అపరాధ పరిహారార్థ బలిచేయగా అతనికి సంతానము కలుగును” అని యెషయా ప్రవక్త ప్రవచించెను. (యెషయా 53:10). కావున క్రీస్తును యెందరంగీకరించిరో వారందరికీ దేవుని పిల్లలగుటకు ఆయన అధికారమనుగ్రహించెను. వారు దేవుని వలన పుట్టిన వారేగాని, రక్తమువలనైనను శరీరేచ్ఛవలనైనను మనుష్యేచ్ఛవలనైనను పుట్టినవారు కారు (యోహాను 1:12,13).

బళ్ళారిలో పూర్వము వకీలుగానుండి కీ॥శే॥ శ్రీ కోలాచలము శ్రీనివాసరావు, ఎం. ఏ.యల్.యల్.బి.గారు నరమేధ అశ్వమేధాది యజ్ఞములు అను పుస్తకమునందు వ్రాసినదేమనగా – తైత్తీయారణ్యకములో మృత్యు దేవతా ! జనములను నశింపజేయు నీ సేవనంతయును నేనీయాగ రహస్యమువలన నశింపజేయుదును అని యున్నది. ప్రపంచ సృష్టికర్త పురుష రూపమేన తనను తాను బలిగానిడుకొనుటయే యీ యాగమ రహస్యము. దైవరూపముననున్న పురుషుడు అప్పటికి నమృతత్వము లేని దైవములకుగాను నర్థమర్త్య దేహమును ధరించి మర్త్యదేహమును బలిగానిడెను. శతపథ బ్రాహ్మణములో – భూతకోటి క్షేమమునకు సృష్టికర్త తాను బలిపశువయ్యెనని యున్నది. అనగా ప్రపంచము వారిరాశియై నిలచి నశించు కాలమున పురుషుడు ప్రపంచోద్ధారకుడై యాగమ విధిచే తనను తాను బలిగనిడుకొని సర్వమునందు తాను వ్యాపించి ప్రపంచమును రక్షించెను. ఇదే ధర్మమును బైబిలు కూడ స్థాపించున్నది. అందరికిగాను నొక్కరు మృతినొందుటచే అందరు మృతినొందినట్లని, ఆయన జీవించుటచే అందరు ఆయనలో జీవించునట్లని వ్రాయబడెను (2 కొరింథీ 5:14,15). అందరిని పాపవిముక్తులుగాజేసి రక్షించుటకై పురుషుడొకడు తన దేహమును బలిగా నర్పించుకొనెనని హిందువుల సిద్ధాంతము. ఈ పురుషమేధ రహస్యమే క్రీస్తు మరణ పునరుత్థాన వృత్తాంతమును సైతము స్థిరపర్చుచు పురాతనకాలమునుండి నమ్మియుండిరనునది తెలుపును.

గొప్ప విద్వాంసుడును, పరిశుద్ధుడునైన పౌలు యిట్లు వ్రాసెను. ఆ లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతినొందెను. సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను (1 కొరింథీ 15:3,4). క్రీస్తు స్వయముగా చెప్పినదేమనగా – లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచూ వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి (యోహాను 5:39). మరియు ఆయన “నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను” అని చెప్పెను (యోహాను 14:6).

పురుష సూక్తమందు వ్రాయబడిన విధముగా యాగముగ నర్పించుకొనిన విరాట్ పురుషుని వలన తప్ప వేయి కర్మల వలనైనను మోక్షప్రాప్తి కలుగదని శాయనాచార్యులవారు భాష్యమందు వ్రాసిరి. “నాన్యం పంథావిద్యతే ఆయనాయ” ఇదిగాక వేరొక మార్గము లేదు. బ్రాహ్మణ పండితుడైన పురుషోత్తమును క్రీస్తును తన స్వంత రక్షకుడుగా అంగీకరించిన తరువాత కొన్ని పుస్తకములు వ్రాసిరి. “కులాచార పరీక్ష” యను పొత్తమునందు వారు వ్రాసినదేమనగా –

శ్లో॥ చతుర్వేద విదో విప్ర సూక్ష్మ బ్రహ్మం నవిదతి॥
వేదభార భరక్రాంత స్సవై బ్రాహ్మణగర్ధభః॥

అనగా గంధపు చెక్కలను మోసి వాటి సువాసన నెరుంగని గాడిద యెటువంటిదో, చతుర్వేద విద్వాంసుడైయుండి సూక్ష్మ బ్రహ్మమును తెలియని విప్రుడును అటువంటివాడేయని తాత్పర్యము.

కావున నో భారతీయులారా ! దేవ శాస్త్రములలో వ్రాయబడినటుల మానవులను రక్షించుటకై భువిపై నవతరించి యజ్ఞమై మృత్యువును జయించి లేచి నమ్మిన భక్తులకు కన్పించి పరమునకేగి మరల భువికి వచ్చి పాపములేని, హింసలేని వసుదైక రాజ్యమును స్థాపించి పాలించనై యున్న ప్రజాపతి ప్రభువైన క్రీస్తేయని గమనించియనయందు విశ్వాసముంచి ఆత్మ రక్షణ బొంది ఇహపర సుఖములకు యోగ్యులగుదురుగాక. క్రీస్తు రాజ్యములో మృతులైన భక్తులు సమాధులలోనుండి బయటకు వచ్చి మహిమ శరీరములను ధరించి పాలింతురు. (ప్రకటన 20:4,6; ఫిలిప్పీ 3:21). యేసుక్రీస్తు దేవుడైతే ఎందుకు సిలువ వేయబడెను? అని ప్రశ్నించువారు గమనించవలసినదేమనగా –

1 యేసుక్రీస్తు అను గ్రీకు పదముల కర్థమేనమగా, రక్షణాభిషిక్తుడు. తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకాపేరు పెట్టబడెను (మత్తయి 1:21). పాపులకు ప్రతిగా విమోచనక్రయధనముగా తన ప్రాణమునిచ్చుటకై క్రీస్తు సిలువ వేయబడెను (మత్తయి 20:28). తన ప్రాణము బలిగా పెట్టుటకును దానిని తిరిగి తీసికొనుటకును తనకు అధికారము కలదని క్రీస్తు చెప్పెను. (యోహాను 10:17). రక్తము చిందింపకుండా పాపక్షమాపణ కలుగదు (హెబ్రీ 9:22). కనుక క్రీస్తు సిలువ వేయబడెను.

2. కృపాసత్యములవలన దోషమునకు ప్రాయశ్చిత్తము కలుగును (సామెతలు 16:6). ప్రాణదానము చేయనిదే ప్రపంచమునకు పుణ్యము లేదు. మరియు కృపాసత్యములు కలిసికొనవు. కాబట్టి క్రీస్తు సిలువ వేయబడెను.

3. ప్రజాపతి మరణమును జయించి మానవునకున్న మరణ భయమును బాపవలసియున్నది. కావున ఆ పిల్లలు (మానవులు) రక్త మాంసములు గల వారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలము గలవానిని అనగా సాతానును మరణము ద్వారా నశింపజేయుటకును. జీవితకాలమంతయు మరణ భయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయనకూడ రక్తమాంసములలో పాలివాడాయెను (హెబ్రీ 2:13,14). కాబట్టి మరణమును జయించి మరణ దాసత్వమునుండి మర్త్యులను రక్షించుటకు క్రీస్తు సిలువ వేయబడెను.

4. పూర్వకాలమందు ఆర్యులేమి, అనార్యులేమి, యూదులేమి యొనర్చిన ఆయా యజ్ఞయాగములు రాబోవుదాని ఛాయయే గాని నిజస్వరూపము క్రీస్తులో యున్నది (కొలొస్స 2:17). కావున వాటికి సంపూర్ణ సిద్ధి కలిగించుటకై క్రీస్తు సిలువకప్పగించు కొనెను. క్రీస్తు మన పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్కబలిని అర్పించి.... ఒక్క అర్పణచేత ఈయన పరిశుద్ధపరచబడిన వారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు (హెబ్రీ 10:10-14).

5. సకల మానవులు పాపపురుషుని జయించలేక ఓడిపోయిరి. క్రీస్తు ఆ పాపపురుషుని జయించి సిలువచేత ఓడించి వాని ప్రధానులను, అధికారులను నిరాయుధులుగా చేసి జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా కనుపరచుటకై సిలువ వేయబడెను (కొలొస్స 2:15).

6. మన పాపములవలన మనము దేవుని శత్రువులమైయుండగా క్రీస్తు మరణము ద్వారా మనము దేవునితో సమాధాన పరచబడినవారమై, ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము (రోమా 5:10). క్రీస్తు అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు. ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు. ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు, ఆయన సిలువ రక్తముచేత సంధిచేసి ఆయనద్వారా సమస్తమును అవి భూలోకమందున్నవైనను పరలోకమందున్నవైనను వాటినన్నిటిని ఆయనద్వారా తనతో సమాధానపరచుకొనవలెననియు తండ్రికి అభీష్టమాయెను. గనుక క్రీస్తు సిలువ వేయబడెను (కొలొస్స 1:17,22).

7. అందరికొరకు ఒకడు మృతినొందెను గనుక అందరును మృతి నొందిరనయి, జీవించువారికమీదట తమకొరకు కాక తమ నిమిత్తము మృతినొంది తిరిగిలేచినవానికొరకే జీవించుటకు క్రీస్తు అందరికొరకు మృతినొందెననియు నిశ్చయించుకొనుటకై యేసు సిలువ వేయబడెను (1 కొరింథీ 5:14).

8. పితృపారంపర్యమైన వ్యర్థ ప్రవర్తనను మనము విడిచిపెట్టునట్లుగా వెండి బంగారములవంటి క్షయవస్తువులచేత మనము విమోచింపబడలేదు గాని తన అమూల్యమైన రక్తముచేత మనలను విమోచించుటకై క్రీస్తు సిలువ వేయబడెను. ఆయన జగత్తు పునాది వేయబడకమునుపే నియమింపబడెను. గాని విశ్వాసులైనవారి నిమిత్తము కడసరికాలమందు ప్రత్యక్షపరచబడెను (1 పేతురు 1:18,19).

9. మనము పాపముల విషయమై చనిపోయి నీతి విషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మనము స్వస్థత పొందితిమి (1 పేతురు 2:24).

10. మనలను దేవునియొద్దకు తెచ్చుటకు, అనీతిమంతులకొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయములో చంపబడియు ఆత్మ విషయములో బ్రతికింపబడి, పాపము విషయములలో ఒక్కసారే శ్రమపడెను. ఆయన పరలోకమునకు వెళ్ళి దూతలమీదను, అధికారులమీదను, శక్తులమీదను అధికారము పొందినవాడై దేవుని కుడిపార్శ్వమున ఉన్నాడు (1 పేతురు 3:18-23).

11. సిలువ వేయబడుటకు పూర్వమే యేసు పదేపదే తాను యెరూషలేముకు వెళ్ళి పెద్దలచేతను ప్రధానయాజకులచేతను

శాస్త్రుల చేతను అనేక హింసలు పొంది చంపబడి, మూడవ దినమున లేచుట అగత్యమని తన శిష్యులకు తెలియజేయుటేగాక, ఇది నా రక్తము అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందించబడుచున్న నిబంధన రక్తము అని చెప్పియుండెను. గనుక ఆయన సిలువవేయబడెను (మత్తయి 16:21; 17:22-33; 20:18,19. 26,28).

12. కయప అను ఒకడు ప్రధానయాజకుడైయుండి వారితో మీకేమియు తెలియదు. జనమంతయు నశింపకుండునట్లు ఒక మనుష్యుడు ప్రజల కొరకు చనిపోవుట మీకు ఉపయుక్తమని మీరు ఆలోచించుకొనరు అని చెప్పెను. మరియు అతడు యేసు ఆ జనము కొరకు మాత్రమేగాక చెదరిపోయిన దేవుని పిల్లలను ఏకముగా సమకూర్చుటకును, చావనై యున్నాడని ప్రవచించెను. కాగా ఆ దినమునుండి వారు ఆయనను చంపనాలోచించుచుండిరి కాబట్టి క్రీస్తు సిలువవేయబడెను (యోహాను 11:49-52).

యేసుక్రీస్తు మృత్యుంజయుడై లేచిన తరువాత – "నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాపములను చూచుచు, నన్ను పట్టి చూడుడు. నాకున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలను, మాంసమును భూతమునకుండవని చెప్పి తన చేతులను, పాదములను వారికి చూపెను. ఆయన మోషే ధర్మశాస్త్రములోను ప్రవక్తల గ్రంథములలోను కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరవలెనని నేను మీ యొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను. అప్పుడు వారు లేఖనములు గ్రహించునట్లుగా ఆయన వారి మనస్సును తెరచి – క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరిట మారుమనస్సును, పాపక్షమాపణను ప్రకటించబడుననియు వ్రాయబడియున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులని చెప్పి పరలోకమునకు ఆరోహణుడాయెను (లూకా 24:37-51).

లేఖనముల ప్రకారము క్రీస్తు మ్రానుపై యజ్ఞము చేసెను. అప్పుడు కొన్ని గంటలలో వందల సంవత్సరాలకు పూర్వమే ప్రవక్తలు వ్రాసిన ఆయా లేఖన భాగములు నెరవేరెను.

ఆర్యయువక పరిషత్‌వారు తననుతాను రక్షించుకోలేని క్రీస్తు యితరులనెట్లు రక్షిస్తాడు? అను తమ పత్రిక 1వ పుటలో ప్రకటించినదేమనగా......

"పుట్టిన ప్రతిప్రాణి మరణించుట సహజము. మరియు అవసరము "జాతస్యహి ధృవో మృత్యు" అట్టిచో పాపులే మరణించెదరనుట ప్రకృతి విరుద్ధము మహా పురుషులెల్లరు మరణించినారు. క్రీస్తు మరణించినాడు, వీరంతా పాపులేనా? పాపులను దుద్ధరించుటకు క్రీస్తు పుట్టినచో 2000 సంవత్సరములకు పూర్వపువారెవరు పాపముల నుండి ఉద్ధరింపబడలేదా? అతడు మరణించిన తరువాత పాపులను యెవరు ఉద్ధరిస్తున్నారు? క్రైస్తవులు పాపులైన అగుదురు గాక. కాని క్రైస్తవులు కాని వారు మాత్రము పాపులు కారు" (1వ పేజీలో).

**విమర్శ :** ఆది మానవ దంపతులగు ఆదాము హవ్వలు తల్లిదండ్రులకు పుట్టలేదు. దేవుడైన యెహోవా వారిని సృజించెను. (ఆదికాండము 1:27). ఆయన వారిని యువతీయువకులుగానే సృష్టించెను. వారు యవ్వనులేయని ఋగ్వేదములోకూడ వ్రాయబడింది. (మండలం 8, సూక్తం 30 ఋక్కు). ఆదాము మనుస్మృతిలో స్వాయంభువ మనువని లిఖింపబడెను. 'మననాత్ మానవః" అతడు ఆలోచించువాడు గనుక మనువనియు, తల్లియు తండ్రియు లేనివాడు గనుక స్వాయంభువుడనియు పిలువబడెను. అతని సంతతివారు మనుజులని చెప్పబడిరి. "మనుసంతతిః మానవః మనోరపత్యాని మానవః" అది మనువగు అతని సంతతివారే మానవులని మనుస్మృతి ద్వితీయాధ్యాయమందు గలదు. అతనినుండియే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు జనించిరని మొదటి వేదమగు ఋగ్వేదములో దశమ మండలం, తొంబదియవ సూక్తం, పండ్రెండవమంత్రంలో వ్రాయబడింది.

"పాపాదవశ్యం మరణం ప్రయాతి" అను నీతిశాస్త్ర వచనానుసారముగా అది నరులగు ఆదాము హవ్వలు దేవుని ఆజ్ఞను మీరినందున పాపులైరి గనుక వారు పాపఫలితమగు మరణమును పొందిరి. "దేవుడు నరులను యథార్థవంతులనుగా పుట్టించెను; గాని, వారు వివిధమైన తంత్రములను కల్పించుకొనియున్నారు" (ప్రసంగి 7:29). " ఏ భేదము లేదు; అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23). కనుక పాపులై పతితులవబడుచున్నారు.

కాబట్టి ఆర్యులేమి, అనార్యులేమి ఆది తల్లియగు "హవ్వవతి" అని భవిష్యత్ పురాణం, ప్రతిసర్గ పర్వములో చెప్పబడిన "హవ్వ"కు పుట్టిన వారేయని గ్రహింపగలము.

ఆది తల్లిదండ్రులగు ఆదాము హవ్వలు దైవాజ్ఞ మీరి పతితులైన తరువాత దేవుడు వారి పాపప్రాయశ్చిత్తార్థమై ఒక జంతువును వధించి దాని రక్తముద్వారా వారికి విమోచన అనుగ్రహించి, దాని చర్మముతో వారికి చొక్కాయిలను చేయించి, వారికి తొడిగించెను (ఆది 3:20,21). అటు తరువాత వారికి పుట్టినవారును తమ పాపప్రాయశ్చిత్తార్థము గొఱ్ఱెలను, మేకలను, ఆవులను, కోళ్ళను బలిగా వధించిరని ఋగ్వేదాది అర్షేయము లేమి, బైబిలు, ఖురాన్ షరీఫ్ మొదలగు గ్రంథములేమి సాక్ష్యమిచ్చుచున్నవి సుమా !

అయితే ఆయా బలులు "రాబోవువాటి ఛాయగలవేగాని, నిజస్వరూపము క్రీస్తులో యున్నది" (కొలొస్స 2:17). ఎందుకనగా "యజ్ఞోవా అవతి తస్య ఛాయ క్రియతే" అనగా యజ్ఞమే రక్షించుచున్నది; దాని నీడ జరుపబడుచున్నది అని గ్రహింపవలెను. సూర్యుడు ఉదయించువరకు ఆయా దీపములను మనుజులు వెలిగించెదరు కాని, సూర్యోదయానంతరము వెలిగింపరు. రాత్రులందు సూర్యుడున్నను భూమి గుండ్రముగా యున్నందున దాని అగ్ని అన్ని భాగములలో వెలుగు ఒకేసారి ప్రకాశింపదు. అలాగే నీతి సూర్యుడగు క్రీస్తు మొదట ప్రాచ్యులగు తూర్పు దేశీయుల వారికిని, అటుతరువాత పశ్చిమ దేశీయులకును తన సువార్త ప్రకాశమును ప్రసరింపజేసెనని తెలియుచున్నది. ఆయనకు పక్షపాతము లేదు.

యేసుక్రీస్తు పురాతన కాలము మొదలుకొని శాశ్వతకాల పర్యంతము ప్రత్యక్షమగుచుండెను (మీకా. 5:2). అయితే కాలము సంపూర్తియైనప్పుడు ఆయన కన్యయు స్త్రీయునగు మరియకు జన్మించి మానవులు స్వీకృత పుత్రులు కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై తానుకూడ ధర్మశాస్త్రమునకు లోబడెను. లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను (కొలొస్స 4:4,5; 1కొరింథీ 15:3,4).

క్రీస్తు మృత్యుంజయుడు గనుక తనను నమ్మినవారిని విమోచించుటకు నిరంతరము జీవించుచున్నాడు. "నిత్యుడగు ఆత్మద్వారా తననుతాను నిర్దోషిగా అర్పించుకొనిన క్రీస్తుయొక్క రక్తము నిర్జీవ క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మన మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధిచేయును" (హెబ్రీ 9:14).

కావున "క్రీస్తు మరణించిన తరువాత పాపులను ఎవరు ఉద్ధరిస్తున్నారు?" అని ఆర్యసమాజమువారు ప్రశ్నించుట నిరర్థకమై యున్నది. మరియు వారు – "క్రైస్తవులు పాపులైన అగుదురుగాక క్రైస్తవులు కానివారు మాత్రము పాపులుగారు" అని వ్రాయుట అసత్యము. ఎందుకనగా – "కామక్రోధ వశాస్సర్వే దేవషిన్ పిత్రు మానవాః" అనగా దేవతలు, పితృ దేవతలు మానవులందరు అరిషడ్ వర్గములగు కామక్రోధాదులకు వశమైనవారేనని హిందూ మత గ్రంథములు ఘోషించుచున్నవి. కనుక –

"పాపోహం, పాపకర్మాహం, పాపాత్మ పాపసంభవః త్రాహిమాం కృపయా దేవ శరణాగతిః వత్సలా దయనియోను ధన్యోస్మి. తనకో అత్రజగత్రయే" అని భారతీయుడు ప్రార్థించుచున్నాడు. అనగా, ఓ దేవా ! నేను పాపిని, పాపము చేయుచున్నాను. పాపములో పుట్టితిని, పాపాత్ముడను నన్ను రక్షింపుము. నీవు కృపగలవాడవు, మూడు లోకములలో నీయెదుట దయను పొందవలసినవాడనగు నేనున్నాను. మరియు "అన్యధా శరణం నాస్తిత్వమేవ శరణం మమ పాపి నామ్ అహమేవ అగ్రే, దయాళూనామ్ త్వంఅగ్రణీః" అనియు ప్రార్థించుచున్నాడు. అనగా – వేరొక దిక్కు లేదు. నీవే నాకు దిక్కు పాపులలో నేను మొదటి వాడను, దయగలవారిలో నీవు అగ్రగణ్యుడవు. కాబట్టి, ఆర్యులేమి, అనార్యులేమి పాపులేయని ధర్మశాస్త్రములు ప్రతిపాదించుట సత్యముసుమా ! ఆర్యులు ఈశ్వర పుత్రులనియు, అమృత పుత్రులనియు, వారు పాపులు కారనియు నేటి ఆర్యసమాజము వారు చెప్పుచున్నారు. అయితే ఆర్య ఋషులేమని ప్రార్థించిరో ఋగ్వేదము సాక్ష్యమిచ్చుచున్నది గమనించుడు –

1 మంత్రము

> అవతే హేళోవరుణ నమోభిరవ యజ్ఞేభిరీ మహేహవిర్భిః ।
> క్షయన్న సభ్య మసుర ప్రచేత రాజన్నేనాంపి శిశ్రథఃకృతాని॥

భావము : ఓ రాజగు వరుణా, నీ కోపమును నమస్కారములతో పోగొట్టుకొనుచున్నాము. అనిష్టము తొలగించునట్టి అధిక ప్రజ్ఞగల యోవరుణా ! మాకొరకిచట నివసించుచు మేము చేసిన పాపములను వదలింపుము. ( ఋగ్వేదము 1వ మండలం, 6వ అనువాకం, 24వ సూక్తం, 257వ ఋక్కు).

2 మంత్రము

మనో మహంతముత, మానో అర్భకం
మాస ఉక్షంతము తమాస ఉక్షితః ।
మానోవధీః పితరం మోతమాతరం మానః
ప్రియస్తన్వో రుద్రరీరిషః ॥
(యజుర్వేదము 16వ అధ్యాయం 15వ మంత్రం)

అనగా ఓ రుద్రా, దుఃఖరూపములగు పాపఫలములిచ్చును దుష్టులను ఏడ్పించు పరమేశ్వరా ! నీవు మాయందలి చిన్న పెద్దలను, గర్భమును, తల్లిదండ్రులను, ప్రియులను, బంధువర్గమును, శరీరులను చంపుటకు మమ్ములను ప్రేరేపింపకుము. నీ దండనకు పాత్రులము గాకుండునట్టి మార్గములందు మమ్ములను నడుపుము.

3 యథానో మిత్రో, వరుణో, యథా రుద్రచ్చ కేతలి !
యథా విశ్వేశ జోషసహ ॥ (ఋగ్వేదము 1-42-3)

తాత్పర్యము : మిత్రుడు (సూర్యుడు), వరుణుడు, రుద్రుడు (శివుడు) సమాన ప్రీతిగల సర్వ దేవతలు మమ్ములను అనుగ్రహించుట యెటులనో తెలిసికొందురుగాక !

4. శ్లో॥ ఇంద్రియాణాంచ సర్వేషాం, యద్యేకం క్షరతీంద్రియమ్ ।
తేనాస్యక్షరతి ప్రజ్ఞాద్రుతేః పాదాది ఓదకమ్ ॥
(మనుస్మృతి రెండవ అధ్యాయం, 99వ శ్లోకం)

అనగా - తోటు సంచిలోని నీరంతయు (దానికిగల నాలుగు కాళ్ళలోని) ఒక కాలుకట్టు విప్పినంతనే కారిపోయినరీతి, ఇంద్రియములలో నొక ఇంద్రియము విషయాసక్తమైనయెడల అన్ని ఇంద్రియముల (కర్మేంద్రియములగు - చేతులు, కాళ్ళు మొదలగు వానియొక్కయు జ్ఞానేంద్రియములగు చెవులు, కన్నులు, ముక్కు, నాలుక చర్మముల యొక్కయు) సంబంధమైన బుద్ధి వ్యవస్థ లేక పాడైపోవును.

5. దేవీ భాగవతము, షష్టమస్కంధము, 10వ అధ్యాయములో

శ్లో॥ పాపం కరోతి మనుజస్తథా దేవాల యోపిచ ।
తథా నారాయణో రాజన్నరశ్చధర్మ జూవుభౌ॥
జాతౌ కృష్ణార్జునే కామం శౌనారాయణస్యసౌ।
పురాణపీఠికేయం వైమునిభిః పరికీర్తి తౌ ॥

**తాత్పర్యము :** ఓ రాజా, మనుష్యులు పాపము చేయుచున్నారు. అలాగే దేవతలును పాపము చేయుచున్నారు. ధర్ముని పుత్రులగు నారాయణుడు, నరుడుయను ఋషులును అటులే పాపము చేసినందున వారు నారాయణుని అంశవలన కృష్ణార్జునులై పుట్టిరి. ఇది మునులచే చెప్పబడిన పురాణపీఠికయందున్నది; అని వ్యాస మహర్షి చెప్పెను.

పైన వ్రాయబడిన ప్రమాణ వాక్యమువలన ఈశ్వర పుత్రులని, అమృత పుత్రులని చెప్పబడిన ఆర్యులు, ఋషులు, మునులు, తపోధనులందరు పాపాత్ములేయని ఋజువగుచున్నది. బైబిలులోకూడ "మనమాయన సంతానమని మీ కవీశ్వరులలో కొందరు చెప్పుచున్నారు. కాబట్టి మనము దేవుని సంతానమైయుండి మనుష్యుల చమత్కార కల్పనల వలన మల్చబడిన బంగారము, వెండి, రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంపకూడదు. ఆ అజ్ఞాన కాలమును దేవుడు చూచిచూడనట్టుగా ఉండెను. ఇప్పుడైతే అంతట అందరు మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. మృతులలోనుండి క్రీస్తును లేపినందున దీని నమ్ముటకు అందరికి ఆధారము కలుగజేసియున్నాడు" అని వ్రాయబడియున్నది (అపో.కార్య 17:26-31).

| **ప్రవచనములు**<br>పాత నిబంధన | **వాటి నెరవేర్పు**<br>క్రొత్త నిబంధన |
|---|---|
| 1. ముప్పది రూకలకు క్రీస్తు అమ్మబడుట. **(యిర్మీయా 3:6-9).** | 1. ఇస్కరియోతు యూదా క్రీస్తును ముప్పది రూకలకు అమ్ముట - తిరిగి వాటిని యిచ్చుట. **(మత్తయి 26:14-16; 27:3-5).** |
| 2. ఖడ్గమా ! నా గొఱ్ఱెల కాపరిమీదను నా సహకారి మీదను పడుము; ఇదే యెహోవా వాక్కు గొఱ్ఱెలు చెదరిపోవునట్లు కాపరిని హతము చేయుము. **(జెకర్యా 13:7).** | 2. యేసు వారితో - నేను అనుదినము దేవాలయములో కూర్చుండి బోధించునప్పుడు మీరు నన్ను పట్టుకొనలేదు. అయితే ప్రవక్తల లేఖనములు నెరవేరునట్లు ఇదంతయు సంభవించెనని చెప్పెను. అప్పుడు శిష్యులు ఆయనను విడిచి పారిపోయిరి. **(మత్తయి 26:55,56).** |
| 3. మన యతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపర్చబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది. **(యెషయా 53:5).** | 3. అందుకు ప్రజలందరు - వాని (యేసు) రక్తము మా మీదను మా పిల్లలమీదను ఉండుగాకనిరి. అప్పుడు పిలాతు, యేసును కొరడాలతో కొట్టించి సిలువ వేయనప్పగించెను. **(మత్తయి 27:25,26).** |
| 4. వారు నా చేతులను నా పాదములను పొడిచి యున్నారు. **(కీర్తనలు 22:16).** | 4. వారు క్రీస్తును సిలువ వేసిరి. అనగా ఆయన చేతులలో, కాళ్ళలో మేకులు దిగగొట్టిరి. **(లూకా 23:33).** |
| 5. నా వస్త్రములను వారు పంచుకొనుచున్నారు. నా అంగీ కొరకు చీట్లు వేయుచున్నారు. **(కీర్తనలు 22:18).** | 5. రాణువవారు యేసును సిలువ వేసిన తరువాత ఆయన వస్త్రములను పంచుకొనిరి. ఆయన అంగీ కుట్టు లేక పైనుండి నేయబడినది. గనుక దాని చింపక దానికొరకు చీట్లు వేసిరి. **(యోహాను 19:23,24).** |
| 6. నా శ్రమను నా దురవస్థను నేను త్రాగిన మాచిపత్రిని చేదును జ్ఞాపకము చేసికొనుము. **(విలాప. 3:19).** | 6. ....యేసు ఎరిగి, లేఖనము నెరవేరునట్లు నేను దప్పిగొనుచున్నాననెను..... వారు ఒక స్పంజీ చిరకతో నింపి, హిస్సోపు పుడకకు తగిలించి ఆయన నోటికి అందించిరి. యేసు ఆ చిరకను పుచ్చుకొని సమాప్తమైనదని చెప్పెను. **(యోహాను 19:28-30).** |
| 7. పస్కా పశువును గూర్చి "దానిలో ఒక్క యెముకైనను మీరు విరువకూడదు". **(నిర్గమ 12:46).** | 7. వారు యేసునొద్దకు వచ్చి... ఆయన కాళ్ళు విరుగ గొట్టలేదు... అతని ఎముకలలో ఒకటైనను విరుగబడదు అను లేఖనము నెరవేరునట్లు ఇది జరిగెను. **(యోహాను 19:23,36).** |
| 8. నా దేవా ! నా దేవా ! నీవు నన్నేల విడనాడితివి. **(కీర్తనలు 22:1).** | 8. ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు - ఏలీ ఏలీ లామా సబక్తానీ అని బిగ్గరగా కేక వేసెను. ఆ మాటకు నా దేవా ! నా దేవా ! నన్నెందుకు చెయ్యి విడచితివి? (విడనాడితివి) అని అర్థము. **(మత్తయి 27:46).** |
| 9. అతడు తనను తానే అపరాధ పరిహారార్థ బలి చేయగా అతని సంతానము చూచును. **(యెషయా 53:10).** | 9. సమాధులు తెరువబడెను; చనిపోయిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను. వారు సమాధులలోనుండి బయటికి వచ్చి అనేకులకు అగుపడిరి. **(మత్తయి 27:53).** |
| 10. అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడెను. ధనవంతుని యొద్ద అతడు ఉంచబడెను. **(యెషయా 53:9).** | 10. అరిమతయియ యోసేపు అను ఒక ధనవంతుడు వచ్చి పిలాతు నొద్దకు వెళ్ళి యేసు దేహమును అడిగి తీసుకొని శుభ్రమైన నారబట్టలతో చుట్టి క్రొత్త సమాధిలో దానిని ఉంచెను. **(మత్తయి 27:57-60).** |
| 11. అన్యాయపు తీర్పు ఆయనకు తీర్చబడెను. **(యెషయా 53:8).** | 11. గవర్నరుగా పిలాతు ఈ నీతిమంతుని రక్తమును గూర్చి నేను నిరపరాధిని మీరే చూచుకొనుడని చెప్పెను. **(మత్తయి 27:94).** |
| 12. వారు తాము పొందినవాని మీద దృష్టియుంచి (రెండవ రాకడలో).... అతని విషయమై దుఃఖించుచు ప్రలాపింతురు. **(జెకర్యా 12:10).** | 12. రాణువ వారిలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను. వెంటనే రక్తమును నీళ్లును కారెను. **(యోహాను 19:34-37).** |

పై పంౖడెండు ప్రవచనములు ఒకదానివెంట నొకటి క్రీస్తు సిలువ వేయబడినప్పుడు నెరవేరెను. ఎవరైనను 12 నంబరులు గల అట్టముక్కలను కలిపివేసి సంచిలో ఉంచి ఒక బాలునిచేత తీయించినచో అవి వరుసక్రమము తప్పక బయటికి తీయబడజాలవు. 1,2,3 నంబరులు గల అట్టముక్కలు ఒకవేళ వరుసగా వచ్చిననగా తక్కినవి రాజాలవు. ఎన్నోవందల సంవత్సరముల క్రిందట ఆయా ప్రదేశములలో ఆయా కాలములందు నివసించిన దీర్ఘదర్శులగు ప్రవక్తలు వచించిన ప్రవచనములు క్రీస్తుపట్ల ఉదయము నుండి సాయంకాలము లోపల ఒకదానివెంట నొకటి క్రమము తప్పక నెరవేరుటనుబట్టి నిజముగా అవి దేవోక్తులై యున్నవనియు, అవి వ్రాయించినవారు దేవుడేయనియు నమ్మగలము. యెహోవా దేవుని వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై – నేను నీతో చెప్పిన మాటలన్నిటిని ఒక పుస్తకములో వ్రాయించుకొనుము అని చెప్పెను. (యిర్మీయా 30:1–3). మరియు " ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు. గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని సహాయముచేత పలికిరి." (2 పేతురు 1:20,21).

క్రీస్తు పాప ప్రాయశ్చిత్తార్థ యజ్ఞము చేయగానే ప్రకృతి ఆయన రక్షకుడైన సృష్టికర్తయైయున్నాడని సాక్ష్యమిచ్చుట గమనార్హము. "అప్పుడు రమారమి మధ్యాహ్నమాయెను. అది మొదలుకొని మూడు గంటలవరకు ఆ దేశమంతటి మీద చీకటి కమ్మెను; సూర్యుడు అదృశ్యుడాయెను. గర్భాలయపు తెర నడిమికి చినిగెను (లూకా 23:44). మరియు భూమి వణకెను. బండలు బద్దలాయెను; సమాధులు తెరువబడెను. నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను. శతాధిపతియు అతనితో కూడ యేసుకు కావలియున్నవారును భూకంపమును, జరిగిన కార్యములన్నియును చూచి మిక్కిలి భయపడి – నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి. (మత్తయి 27:51–54).

"సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెర్రితనముగాని రక్షింపబడుచున్నవారికి దేవుని శక్తి, జ్ఞాని యేమయ్యెను? శాస్త్రి యేమయ్యెను? ఈ లోక జ్ఞానమును దేవుడు వెర్రితనముగా చేసియున్నాడు గదా! దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానముచేత దేవునిని ఎరుగకుండినందున సువార్త ప్రకటనయను వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వత సంకల్పమాయెను. క్రీస్తు దేవుని శక్తియును, దేవుని జ్ఞానమునై యున్నాడు" (1 కొరింథీ 1:18–24).

" మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ యేసుక్రీస్తు నామముననే మనము రక్షణ పొందవలెనుగాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపో. 4:12).

ప॥ కృపయున్ సత్యము రెండునేకమై ధాత్రిన్ మానవాకారమై
ఉపమానోజ్వల దివ్య బోధలన్ ప్రియంబొప్పర బోధించి
పాప పయోరాశిన్ మునుగు మర్త్యులుగావ జీవమర్పించి లేచి
పవిత్రోన్నత ముక్తి పీఠమున నిల్చెన్ సచ్చిదానందుడై

**ప్రశ్న :** అయ్యలారా ! రక్షణ పొందుటకు నేను ఏమి చేయవలెను?

**జవాబు :** ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము. అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురు (అపొ.కార్య 16:30,31).

"మనలను ప్రేమించుచు తన రక్తమువలన మన పాపములనుండి మనలను విడిపించినవానికి మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగునుగాక ఆమేన్... ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు; ప్రతి నేత్రము ఆయనను చూచును; ఆయనను పొడిచినవారును చూచెదరు; భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు; అవును ఆమేన్.

"అల్ఫాయు, ఓమేగయు నేనే. వర్తమాన భూత భవిష్యత్కాలములలో ఉండువాడను నేను అని సర్వాధికారియు దేవుడునగు ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (ప్రకటన 1:6–8).

ప్రియ పఠితులారా, మనకు మరణము ఎప్పుడు వచ్చునో తెలియదు. గనుక ఇప్పుడే యేసుక్రీస్తును నమ్మి ప్రతివారును ఆత్మ రక్షణ పొందుట అవసరమైయున్నది సుమా ! తథాస్తు.

## క్రైస్తవ సాహిత్య చరిత్రలో ఇటువంటి గ్రంథము తెలుగులో ఇంతవరకు రాలేదు.

# మీకు తెలుసా ?

బైబిలులోని ఒక "నిర్ణీత అంశము" పై ఎవరు? ఏమిటి? ఎప్పుడు? ఎక్కడ? ఎందుకు? అనే ప్రశ్నలకు జవాబుల కొరకు వెదకుతున్నారా? లేక ఒక నిర్ణీత అంశము బైబిలులో ఎన్నిసార్లు ప్రస్తావించబడినదో కనుగొనాలనుకుంటున్నారా? అయితే, పరిశుద్ధ గ్రంథంలో మీరు తెలుసుకోవాల్సిన అద్భుత ఆత్మీయ సత్యాలు మరియు అసాధారణ గణాంకాలతో – **"బైబిల్ సమాచారమ్" సంపూర్ణ బైబిలు జాబితాలు** అనే పుస్తకాన్ని ప్రప్రథమంగా తెలుగులో విడుదల చేశాము. క్రైస్తవ సాహిత్య ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన "విల్మింగ్‌టన్ బైబిలు గైడు"లోని ముఖ్యాంశాలన్నిటితో రూపొందించబడిన ఈ గ్రంథము యొక్క ఒక్క అంశము అను ప్రస్తావన లేకుండ దాదాపు బైబిల్లో ప్రస్తావించబడిన ప్రతి అంశము తీసికొనబడి, ఆ అంశము బైబిల్లో ఎక్కడ, ఎన్నిసార్లు ప్రస్తావించబడిందో కనుగొని, వాటన్నిటిని సేకరించి, అక్షరానుక్రమమైన 430 జాబితాల్లో 8000 పైగా అద్భుత ఆత్మీయ సత్యాలతో, 25000 పైగా రిఫరెన్సులతో నింపబడింది. హృదయాన్ని ఆశ్చర్యానందాలతో నింపే ఈ 640 పేజీల పుస్తకంలో పొందుపర్చబడిన జాబితాలలో మచ్చుకు కొన్ని ........ ❁ 26 అగ్నిజ్వాలలు ❁ 17 అబద్ధములు మరియు మోసములు ❁ 10 అభిషేకములు ❁ అన్యదేవతలు మరియు విగ్రహారాధనలు ❁ 24 అంత్యక్రియలు ❁ రాబోవు అంత్యక్రీస్తును గూర్చి 21 వాస్తవములు ❁ 18 మంది అపొస్తలులు ❁ 6 అరణ్యములు ❁ 8 అర్పణలు ❁ 4 అసాధారణ విషయములు ❁ విశ్వాసులకు దేవుడిచ్చిన 127 ఆజ్ఞలు ❁ 7 ఆత్మహత్యలు ❁ ఆపదలు మరియు అపాయములనుండి తప్పించుకొనిన 12 మంది ❁ 45 ఆహార పదార్థములు ❁ 112 ఉపమానములు ❁ 46 ఉపమాలంకారములు ❁ 16 ఉపవాసములు ❁ ఎక్కువ మంది భార్యలుగల 13 మంది ❁ 79 యేడ్చినవారు ❁ 32 కపటోపాయములు ❁ 11 కరవులు ❁ 5 కాపరులు ❁ 8 కాపరుల కర్తవ్యములు ❁ ఇతివృత్తమునుబట్టి కీర్తనలు 46 విధాలుగా వర్గీకరణ ❁ 26 కీర్తనలు మరియు పాటలు ❁ దేవుని నుండి క్రైస్తవునికి 7 దైవిక పిలుపులు ❁ ప్రభువైన క్రీస్తు తన తీర్పు సింహాసనము యొద్ద పరీక్షించు 12 లక్షణములు ❁ 24 కొండలు మరియు పర్వతములు ❁ 38 ఖనిజములు మరియు లోహములు ❁ 22 మంది ఖైదీలు ❁ పరిశుద్ధ గ్రంథములోని 66 పుస్తకముల గ్రంథకర్తలు ❁ పరిశుద్ధ గ్రంథములో ప్రస్తావించబడిన 26 గ్రంథములు ❁ 9 గూఢార్థము గల వాక్యములు ❁ 13 మంది గొఱ్ఱెల కాపరులు ❁ బైబిలు సంబంధమైన క్రీస్తు పూర్వపు 99 అతిముఖ్యమైన తారీఖులు ❁ బైబిలు సంబంధమైన క్రీస్తు శకపు 60 అతిముఖ్యమైన తారీఖులు ❁ బైబిలులోని చరిత్రయొక్క 12 కాలవిభాగములు ❁ పురాతత్వ శాస్త్ర పరిశీలనద్వారా నిర్ధారించబడిన 85 బైబిలు సంబంధమైన దృగ్గోచర విషయాలు ❁ బైబిలులోని 70 అతిముఖ్యమైన సంఘటలను ❁ తెలుగు బైబిలు చరిత్ర ❁ 21 మంది పలికిన చివరి మాటలు ❁ 79 జంతువులు మరియు పక్షులు ❁ 27 జాతులు, ప్రజలు మరియు దేశములు ❁ తూనికలు, కొలతలు మరియు ధనము ❁ 49 తెగుళ్లు మరియు ఉపద్రవములు ❁ 44 మంది దంపతులు ❁ దేవదూతలను గూర్చిన 27 వాస్తవములు ❁ దేవదూతలయొక్క 47 భూసంబంధమైన కార్యకలాపములు ❁ దేవుని గూర్చి 23 వాస్తవములు ❁ దేవుడు యెరిగినవి మరియు ఆయన చూచు 15 విషయములు ❁ తండ్రియైన దేవునిగూర్చిన 50 వాస్తవములు ❁ త్రిత్వము మరియు దానికి సంబంధించిన 12 లేఖనముల ఆధారములు ❁ నరకమునగూర్చి 9 వాస్తవములు ❁ 100 పట్టణములు – చారిత్రక ప్రాధాన్యతలు ❁ పరలోకమును గూర్చి 53 వాస్తవములు❁ పరిశుద్ధాత్మ దేవుని 57 పరిచర్యలు ❁ పరిశుద్ధ గ్రంథము – 66 పుస్తకముల సాహిత్య శైలులు ❁ 363 ప్రవచనములు ❁ 166 ప్రశ్నలు ❁ 34 ప్రసంగములు ❁ పాత, క్రొత్త నిబంధనలలో పరస్పరము సమభావము గల లేఖనములు ❁ 45 రకములైన పాపములు ❁ 120 ప్రార్థనలు ❁ ప్రత్యేక కార్యనిర్వహణకై దేవునిచే పిలువబడిన 50 మంది ❁ పౌలు జీవితము మరియు 4 సువార్త ప్రయాణములు వాటి పటములు ❁ 31 బహుమతులు ❁ 90 ముంగుర్తులు మరియు పోలికలు ❁ 20 ముద్దులు ❁ 83 యుద్ధములు మరియు పోరాటములు ❁ యేసుక్రీస్తునుగూర్చి 400 అంశములు ❁ 183 సాదృశ్యములు, గుర్తులు మరియు చిహ్నములు ❁ 208 సూచకక్రియలు ❁ 42 విందులు ❁ విశ్వాసులకు దేవుని 41 వాగ్దానములు ❁ పరిశుద్ధ గ్రంథములోని 101 అతిముఖ్యమైన అధ్యాయములు ❁ సాతాను మరియు పతనమైన దేవదూతలనుగూర్చి 104 అంశములు ❁ 21 స్వప్నములు మరియు దర్శనములు...

... ఎన్నో.... ఎన్నెన్నో మీరు ఊహించలేనన్ని అక్షరక్రమబద్ధమైన జాబితాలు ఈ **"బైబిల్ సమాచారమ్"**లో పొందుపర్చ బడ్డాయి. మనోరంజకమైన ఈ పుస్తకం బైబిలును ప్రేమించే ప్రతి ఒక్కరిని ప్రోత్సహించి, ఉత్తేజపరిచి, మీ బైబిలు జ్ఞానానికి

సవాలు విసిరి, ప్రేరణ కలిగించి, విస్మయపరుస్తుంది. ఈ గ్రంథం ఒక్క బోధకులకు, సంఘ కాపరులకు, బైబిలు కళాశాల అధ్యాపకులకు మాత్రమే గాక, బైబిలు విద్యార్థులకు, సండే స్కూల్ ఉపాధ్యాయులకు, బైబిల్ క్విజ్ నిర్వాహకులకు – ఒకరేల, బైబిలు జ్ఞానాన్ని ఆశించే ప్రతి ఒక్కరికీ అవసరమైనదే. మరిముఖ్యంగా, బైబిలుపై ఒక బృందంగా గాని లేక వ్యక్తిగతంగా గాని అధ్యయనం చేసేవారికి, ప్రసంగీకులకు మిక్కిలి ప్రయోజనకరమైన పనిముట్టు. **"సంపూర్ణ బైబిలు జాబితాలు"** అనే మకుటంతో ఆంగ్లంలో "టిండేల్ హౌస్ పబ్లిషర్స్, అమెరికా" వారు ప్రచురించిన ఈ పుస్తకాన్ని తెలుగు క్రైస్తవులకు అందించాలనే ఆకాంక్షతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, రాయల్టీలు కట్టి, ముద్రణ హక్కులు పొంది ప్రచురించాము. ప్రపంచవ్యాప్తముగా ఆంగ్లములో కొన్ని లక్షల ప్రతులు విక్రయించబడిన ఈ పుస్తకము అసలు ధర 400–00 రూపాయలు. అయితే తెలుగువారికి అందుబాటు ధరలో ఉండాలనే ఉద్దేశ్యంతో కేవలము 200–00 రూపాయలకే అందించుచున్నాము. వేరే మా గ్రంథశాలను దర్శించి మీ ప్రతిని పొందండి. పోస్టు ద్వారా పొందాలనుకుంటే రూ. 250/– ఎమ్. ఓ. మా అడ్రసుకు పంపండి. ఈ ధరలు 2007 సంవత్సరము చివరివరకు మాత్రమే వర్తించును.

## మా ఇతర ప్రచురణలు

| | పుస్తకము పేరు | రచయిత | పేజీలు | ధర |
|---|---|---|---|---|
| 1. | జీవము గల దేవుని సంఘము | ఆర్. కె. క్యాంప్‌బెల్ | 426 | 50–00 |
| 2. | దేవుని వాక్యమును అధికారయుతంగా బోధించుట స్త్రీ యొక్క కర్తవ్యమా? | ఆర్. కె. క్యాంప్‌బెల్ | 64 | 15–00 |
| 3. | పరిశుద్ధాత్మ ఒక దైవిక వ్యక్తి | హెచ్. ఎల్. హైకూప్ | 174 | 15–00 |
| 4. | రూతు గ్రంథము | హెచ్. ఎల్. హైకూప్ | 184 | 30–00 |
| 5. | క్రైస్తవ విశ్వాసి పునాది సత్యములు | హెచ్. ఎల్. హైకూప్ | 162 | 30–00 |
| 6. | లేఖనముల వెలుగులో స్వస్థతలు, భాషలు సూచకక్రియలు అద్భుత కార్యములు | హెచ్. ఎల్. హైకూప్ | 90 | 6–00 |
| 7. | హెబ్రీయులకు వ్రాసిన పత్రిక | హెమిల్టన్ స్మిత్ | 128 | 15–00 |
| 8. | ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక | హెమిల్టన్ స్మిత్ | 114 | 15–00 |
| 9. | పరిశుద్ధాత్మను గూర్చి పదకొండు సాదృశ్యములు | సైలాస్ ఫాక్స్ | 164 | 25–00 |
| 10. | మీ ప్రశ్నలకు జవాబులు | సైలాస్ ఫాక్స్ | 253 | 40–00 |
| 11. | యెహోవా దేవుని ఏడు పండుగలు | జి. సి. విల్లీస్ | 170 | 20–00 |
| 12. | స్వర్ణ గుడారము (ప్రత్యక్ష గుడారముపై సంపూర్ణ వివరణ, రంగుల బొమ్మలతో) | జె.రో | 90 | 40–00 |
| 13. | ప్రత్యక్ష గుడారము | ఎ. రోసిల్ | 20 | 15–00 |
| 14. | ప్రభురాత్రి భోజనము | టి. విజయ్ కుమార్ | 184 | 25–00 |
| 15. | యజ్ఞం | సి. హెచ్. ఫ్రాన్సిస్ | 56 | 10–00 |
| 16. | బైబిలు సత్యవేదము రక్షకుడు యేసుక్రీస్తే | సి. హెచ్. ఫ్రాన్సిస్ | 120 | 25–00 |
| 17. | 40 అమూల్య వర్తమానములు | – | 275 | 30–00 |
| 18. | నా విందులు | జి. దేవిసన్ | 63 | 15–00 |
| 19. | 66 గ్రంథముల సంక్షిప్త సమీక్ష | ఎల్. ఎమ్. గ్రాంట్ | 70 | 15–00 |
| 20. | హగ్గయి | జె. రిడిల్ | 95 | 20–00 |
| 21. | పరిశుద్ధ గ్రంథములోని 1000 వాగ్దానములు | జె. రిడిల్ | 190 | 30–00 |

| | | | | |
|---|---|---|---|---|
| 22. | వేయి వజ్రాలు | కె. జి. పాల్ | 183 | 20-00 |
| 23. | మోసగించబడుతున్న సంఘము | అలెగ్జాండర్ సైబల్ | 82 | 15-00 |
| 24. | యాకోబు చివరి మాటలు | హ్యూగో బౌటర్ | 103 | 25-00 |
| 25. | యేసుక్రీస్తు సంపూర్ణ చరిత్ర | జి. జాన్ | 240 | 40-00 |
| 26. | బైబిల్ సమాచారమ్ | హెచ్. ఎల్. విల్మింగ్టన్ | 640 | 200-00 |
| 27. | యోసేపు | హామిల్టన్ స్మిత్ | 184 | 30-00 |
| 28. | నమ్మి బాప్తిస్మము | టి. విజయ్ కుమార్ | 56 | 10-00 |
| 29. | ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ సంఘ చరిత్ర | డా॥ యం. మోజెస్ | 316 | 100-00 |
| 30. | బేతేలు, యాకోబు దేవుని నివాసస్థలము | బౌటర్ | 104 | 30-00 |
| 31. | 20 విలువైన ప్రసంగాలు | - | 192 | 25-00 |
| 32. | ప్రభువు రెండవ రాకడ | ఎడ్వర్డ్ డెన్నెట్ | 44 | 6-00 |
| 33. | యోబు గ్రంథము | వల్లభాపురపు పెదరత్నం | 68 | 15-00 |
| 34. | సత్యవాక్య సవిభజన | డా॥ సి. ఐ. స్కోఫిల్డ్ | 88 | 20-00 |
| 35. | సిలువపై రక్షకుడు పలికిన ఏడు మాటలు | పింక్ | 96 | 40-00 |
| 36. | ఆమె పేరు స్త్రీ - మొదటి భాగము | గీన్ కార్సెన్ | 200 | 60-00 |
| 37. | ఆమె పేరు స్త్రీ - రెండవ భాగము | గీన్ కార్సెన్ | 228 | 60-00 |
| 38. | యాత్రికుని ప్రయాణము | జాన్ బన్యన్ | 374 | 70-00 |
| 39. | దేవుడు వాడుకొను మనుష్యుడు | డా॥ ఆస్వాల్డ్ జె. స్మిత్ | 78 | 30-00 |
| 40. | సిలువ సందేశం | జేకబ్ ప్రభు | 96 | 30-00 |
| 41. | క్రీస్తును గూర్చిన ప్రవచనములు | ఆర్. ఇ. హార్లో | 120 | 40-00 |
| 42. | పరుని స్నేహితుడు (బాప్తీస్మమిచ్చు యోహాను జీవితముపై వ్యాఖ్యానము) | రాబర్ట్ హెచ్. సైక్స్ | 176 | 50-00 |
| 43. | చిన్నమంద గీతావళి (502 పాటలు) | - | 411 | 40-00 |
| 44. | సుబీజం - 2007 | - | 370 | 30-00 |
| 45. | ప్రభువు సమీపం - 2007 | - | 370 | 40-00 |
| 46. | క్రైస్తవ నిరీక్షణ అనుదినమాలిక | సైలాస్ ఫాక్స్ | 372 | 40-00 |
| 47. | మీరేకాంతముగా రండి | జె. ఆర్. మిల్లర్ | 366 | 100-00 |
| 48. | మార్టిన్ లూథర్ | మైక్ ఫెరాన్ | 180 | 30-00 |
| 49. | అదోనిరామ్ జడ్సన్ | ఫెయిత్ కాక్స్ బెయిలీ | 130 | 20-00 |
| 50. | ప్రపంచ క్రైస్తవ హతసాక్షులు (మొదటి భాగము క్రీ.శ. 37-1900) | జాన్‌ఫాక్స్ | 340 | 80-00 |

**వివరాలకై.......**

**క్రిస్టియన్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్**
9-1-38/1, వై. యం. సి. ఎ., సికింద్రాబాద్ - 500 003.
ఫోన్ : 040-66330113

## BIBLIOGRAPHY


| | | | |
|---|---|---|---|
| 1. | దేవీ భాగవతం | – | 6 |
| 2. | స్కాంద పురాణం | – | 6 |
| 3. | హేమాద్రి ప్రాయశ్చిత్త కాండ | – | 6 |
| 4. | మను స్మృతి | – | 7 |
| 5. | నీతి శాస్త్రము | – | 7 |
| 6. | భగవద్గీత | – | 7 |
| 7. | కూర్మ పురాణం | – | 7 |
| 8. | సామవేద తాండ్య బ్రాహ్మణం | – | 7 |
| 9. | భగవద్గీత | – | 8 |
| 10. | ఋగ్వేదం | – | 9 |
| 11. | ఆర్యేకవి కుతంత్రం | – | 9 |
| 12. | ఋగ్వేదం | – | 10 |
| 13. | మనుస్మృతి | – | 11 |
| 14. | అశ్వమేధ తంత్రం | – | 11 |
| 15. | మండకోపనిషత్ | – | 12 |
| 16. | స్కాంద పురాణం | – | 12 |
| 17. | తాండ్య మహా బ్రాహ్మణం | – | 12 |
| 18. | ఋగ్వేదం | – | 12 |
| 19. | ఋగ్వేదం | – | 13 |
| 20. | ఋగ్వేదం | – | 17 |
| 21. | గురు గీతలు | – | 17 |
| 22. | కులాచార పరీక్ష | – | 18 |
| 23. | ఋగ్వేదం | – | 21 |
| 24. | యజుర్వేదం | – | 22 |
| 25. | మనుస్మృతి | – | 22 |
| 26. | ఋగ్వేదం | – | 22 |
| 27. | దేవీ భాగవతం | – | 10 |